# విశాల భారతి

07-07-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 183




## బలహీనంగానే నైరుతి

- సగటు కంటే 31శాతం తక్కువ వర్షపాతం నమోదు
- కూరగాయలు, గుడ్లు, నూనెల ధరల్లో పెరుగుదల
- పంటలు తగ్గి, ధరలు పెరిగే ముప్పు
- నీటి నిల్వలు 26శాతానికి పడిపోయాయి
- ఖరీఫ్ సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం 03

జూలైలోనూ తక్కువ వర్షా లే కురిసే సూచన

# హైడ్రా వల్ల రియల్ ఎస్టేట్ కుప్పకూలుతోందా?

## హైడ్రా కూల్చివేతలతో రియల్ ఎస్టేట్ పడిపోయిందని వాదన

- రికార్డు ధరలను చూపుతూ ఆ ఆరోపణలను ఖండించింది
- అనుమతులున్నా కూల్చివేతలతో అభద్రతాభావం 03
- అనిశ్చితితో కొనుగోళ్లు తగ్గి 'వెయిట్ అండ్ వాచ్' పరిస్థితి
- ప్రభుత్వ అనుమతులున్నా కూల్చివేతలు చేపట్టడంపై చర్చ
- ఇది రాజకీయ లబ్ధి కోసమేనని ఇరు పార్టీల మాటల యుద్ధం






## హైదరాబాద్ టూరిజంపై సీఎం ఫోకస్

- అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో తీర్చి దిద్దాలి
- నగరాన్ని అంతర్జాతీయ పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం 02
- తారామతి, దుర్గం చెరువు, దిల్ కుషా గెస్ట్ హౌజ్‌ల ఆధునీకరణ
- నగర అటవీ ప్రాంతాల్లో ప్రత్యేక పార్కుల ఏర్పాటు

## రేవంత్ మూర్ఖపు ప్రయత్నాలు బంజేయ్



03

- వెంటనే కన్నెపల్లి పంప్ హౌస్‌లు ఆన్ జేయి
- రాజకీయం ఆపి, వెంటనే పంపింగ్ ప్రారంభించాలి
- పేదల ఇళ్ల కూల్చివేతలు అనాలోచితం, అమానవీయం



## రేవంత్ డబ్బుల బస్తాలు మోస్తుండు

03

- అవి ఎక్కడికి మోస్తుండో నాకంటే బాగా మీకే తెలుసు
- నిన్న కన్నెపల్లికి రెండు మోటార్లు ఆన్ చేయమని చెప్పినం అయినా వింటలేదు
- సరిగ్గా నీళ్ల పాయింట్ చూసి కాళేశ్వరం కట్టినం
- మళ్లీ కేసీఆర్ సీఎం అయితేనే సంతోషంగా ఉంటం
- అధికారం పోయినా బీఆర్ఎస్‌పై మమకారం దగ్గలే
- మల్లాపూర్ హమాలీ యూనియన్ సభలో కేటీఆర్

## బావబామ్మర్దుల పొలిటికల్ ఫైట్

- పార్టీలో పైచేయి కోసం బావబామ్మర్దుల పోటీ
- ఆర్థిక అంశాలు, గణాంకాలతో హరీశ్ పట్టు
- కాళేశ్వరం పర్యటనతో కేటీఆర్ క్షేత్రస్థాయి ఫోకస్
- ప్రాజెక్టు టూర్‌లో హరీశ్ లేకపోవడంపై సందిగ్ధత
- విడివిడి పర్యటనలు, ప్రకటనలతో పోటాపోటీ
- వీరి పోటీతో పార్టీ భవిష్యత్తుపై ఉత్కంఠ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** బీఆర్ఎస్ పార్టీలో బావబామ్మర్దుల రాజకీయాలు మరోసారి హాట్ టాపిక్‌గా మారాయి. ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వంపై దాడుల్లో మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ఇద్దరూ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఒకరు రాజకీయంగా పైచేయి సాధిస్తున్న సమయంలో మరొకరు కీలక అంశంతో ముందుకొస్తున్నారు. ఇది యాదృచ్ఛికమా లేక రాజకీయ ప్రాధాన్యం కోసం జరుగుతున్న సహజ పోటీనా అని పార్టీ శ్రేణుల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. గత పది రోజులుగా రాష్ట్ర అప్పులు, ఆర్థిక పరిస్థితి, గురుకుల టెండర్ల విషయంలో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ తరహాలో పాలిటిక్స్ వేడెక్కాయి. గత ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు రిజర్వుబ్యాంకు లెక్కలు, కాగ్ నివేదికలను ప్రస్తావిస్తూ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు ఇచ్చారు. ప్రభుత్వ గణాంకాలు తప్పు అంటూ బహిరంగ సవాల్ విసిరి చర్చకు సిద్ధమంటూ రోడ్డుమీదికి వచ్చి అందరి దృష్టిని ఆకర్షించారు. గతంలో కేటీఆర్ తెలంగాణ భవన్‌లో ప్రెస్ మీట్లకు మాత్రమే పరిమితమయ్యారు. మిగతా 2లో..

## డీఎస్పీ భీమ్ రెడ్డి అరెస్ట్



- రూ. 300 కోట్ల అక్రమాస్తుల కేసులో ఏసీబీ అరెస్ట్ చేసింది
- నాంపల్లి ఏసీబీ కోర్టులో ఆయనను హాజరుపరుస్తున్నారు
- 17 ప్రాంతాల్లో సోదాలు చేసి భారీ ఆస్తులను గుర్తించారు
- అరెస్ట్ సమయంలో అనారోగ్యంతో కొంత జాప్యం జరిగింది

06

## హైదరాబాద్‌లో అసదుద్దీన్ చిచ్చు



- సౌత్-వెస్ట్ కార్యాలయాల తరలింపును ఓవైసీ తప్పుబట్టారు
- పాతనగరం అభివృద్ధిని ప్రభుత్వం అణచివేస్తోందని ఎంఐఎం ఆరోపణ
- దీనిని 'ప్రాంతీయ వివక్ష'గా చూపి ఓటర్లను ఏకం చేసే ప్రయత్నం
- ట్రాఫిక్ నివారణ, నగర సమగ్ర అభివృద్ధి కోసమే ఈ మార్పులు
- వ్యాపార కేంద్రాల తరలింపుతో ఉపాధిపై ఎఫెక్ట్ పడే ప్రమాదం
- రాజకీయాలు ఆపి, ప్రజలకు మేలు చేసేలా అభివృద్ధి జరగాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** హైదరాబాద్ నగర రాజకీయాల్లో అసదుద్దీన్ ఓవైసీ తాజాగా మరో కొత్త చర్చకు తెరలేపారు. సౌత్ అలాగే వెస్ట్ హైదరాబాద్ పరిధిలోని కీలక ప్రభుత్వ కార్యాలయాలను ఇతర ప్రాంతాలకు తరలించడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇది సాధారణ ప్రజల్లో అభద్రతా భావాన్ని పెంచుతుందని సోషల్ మీడియా వేదికగా వాదించారు. ముఖ్యంగా గుడిమాల్కాపూర్ మార్కెట్ తరలింపు నిర్ణయం స్థానికంగా పెద్ద వివాదానికి దారితీసింది. పాతనగరం ప్రాముఖ్యతను తగ్గించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందనే ఆరోపణలు చేస్తున్నారు. మిగతా 3లో..

## కమీషన్ల కోసమే కాళేశ్వరం



- దోచుకున్న బీఆర్ఎస్ నాయకులకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు లేదు
- స్వార్థం కోసం నాణ్యత లేని భారీ ప్రాజెక్టులు కట్టారు 02
- కమీషన్లు రావు కాబట్టే గతంలో ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు
- పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించడమే కాంగ్రెస్ లక్ష్యం
- అవినీతి వల్లే ప్రాజెక్టులు కుంగి, రిపేర్లు చేయాల్సి వస్తోంది

# కమీషన్ల కోసమే కాళేశ్వరం

- దోచుకున్న బీఆర్ఎస్ నాయకులకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు లేదు
- స్వార్థం కోసం నాణ్యత లేని భారీ ప్రాజెక్టులు కట్టారు
- కమీషన్లు రావు కాబట్టే గతంలో ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు
- పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించడమే కాంగ్రెస్ లక్ష్యం
- అవినీతి వల్లే ప్రాజెక్టులు కుంగి, రిపేర్లు చేయాల్సి వస్తోంది
- అబద్ధపు ప్రచారాలతో రాజకీయ లబ్ధి పొందడం కేటీఆర్‌కు తగదు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కన్నెపల్లి పర్యటన వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన విమర్శలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలపై లేనిపోని ఆరోపణలు చేయడం కేటీఆర్ స్థాయికి తగదని మంత్రి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని అడ్డగోలుగా దోచుకున్న బీఆర్ఎస్ నాయకులకు, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదని ఆయన స్పష్టం చేశారు. స్వార్థపూరిత రాజకీయ లబ్ధి కోసం తప్పుడు వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్ల తమ పాలనలో జరిగిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి ప్రతిపక్ష నాయకులు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఘాటుగా హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కమీషన్ల కోసం మాత్రమే నిర్మించిన ప్రాజెక్టు అని, దీని వెనుక కేవలం అధికార పార్టీ నాయకుల స్వార్థం మాత్రమే దాగి ఉందని మంత్రి పొంగులేటి ఆరోపణలు చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే తమ జేబులు నింపుకోవడంపైనే దృష్టి పెట్టిన గత పాలకులు, ఈ ప్రాజెక్టు రూపకల్పనలో భారీ స్థాయిలో అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతోందని చెప్పారు. ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని వృథా చేసిన వారు, సామాన్యుల సంక్షేమం కోసం పని చేస్తున్న ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదమని మంత్రి ఎద్దేవా చేశారు. ప్రజా క్షేమం కోరే వారికి ఎప్పుడూ ప్రజల మద్దతు ఉంటుందని ఆయన ధీమాగా చెప్పారు. ఖమ్మంలో మీడియాతో మాట్లాడిన అనంతరం విడుదల చేసిన ప్రకటనలో, పేదలకు గూడు కల్పించడంపై తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇండ్లు కట్టిస్తే ఎటువంటి కమీషన్లు రావని తెలిసినప్పటికీ, పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే తమ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. భారీ ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా భారీగా కమీషన్లు వస్తాయని తెలిసినా, ప్రజల కోసం తాము అటువంటి అడ్డదారులు తొక్కలేదని మంత్రి వివరించారు. బీఆర్ఎస్ నాయకులు ఎప్పుడూ కమీషన్లు వచ్చే భారీ ప్రాజెక్టులనే ఎంచుకున్నారని, సామాన్య ప్రజల అవసరాల కంటే తమ ఆర్థిక లాభాలకే వారు ప్రాధాన్యత ఇచ్చారని పొంగులేటి విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టమైన హామీని ఇచ్చారు. బీఆర్ఎస్ పాలనలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా జరిగిందని, అందుకే మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు దెబ్బతిన్నాయని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. నాణ్యత లేని పనుల వల్ల ఇప్పుడు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి రిపేర్లు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కమీషన్ల ఆశతో చేసిన అనాలోచిత పనుల వల్ల రాష్ట్రానికి భారీ నష్టం వాటిల్లిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. కేటీఆర్ అబద్ధాలతో రాజకీయ లబ్ధి పొందాలని చేసే ప్రయత్నాలు ఏమాత్రం ఫలించవని, వాస్తవాలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడిన వారు చట్టం నుంచి ఎప్పటికీ తప్పించుకోలేరని పొంగులేటి తీవ్ర స్వరంతో హెచ్చరికలు జారీ చేశారు. ప్రజల రక్తాన్ని, చెమటను దోచుకుని వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్ నాయకులకు, సంక్షేమ ప్రభుత్వంపై మాట్లాడే అర్హత లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోసారి నొక్కి చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు ఇష్టారాజ్యంగా వ్యవహరించిన వారు ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేసిన ఘనత కేవలం గత పాలకులదేనని మంత్రి మండిపడ్డారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తుంటే, అబద్ధపు ప్రచారాలతో గందరగోళం సృష్టించాలని చూడటం అనాగరికమని ఆయన విమర్శించారు. అభివృద్ధిని అడ్డుకోవాలని చూసే శక్తులను ప్రజలు ఎప్పటికీ క్షమించరని మంత్రి చాలా స్పష్టంగా హెచ్చరించారు. నిజమైన ప్రజా సేవకుడు ఎప్పుడూ ప్రజల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తాడని, కానీ గత పాలకులు మాత్రం స్వప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చారని మంత్రి పొంగులేటి విశ్లేషించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి వ్యవహారంపై సమగ్ర విచారణ జరుగుతోందని, త్వరలోనే దోషులందరికీ శిక్ష పడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ ఉనికి కోసం అర్థం పర్థం లేని ఆరోపణలు చేయడం మానుకోవాలని కేటీఆర్‌కు మంత్రి సూచించారు. ప్రజాస్వామ్యంలో బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా ఉండాలి తప్ప, అబద్ధాల పునాదుల మీద రాజకీయాలు చేయకూడదని ఆయన హితవు పలికారు. ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రతి గ్రామానికి తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అర్హులైన పేదలందరికీ ఇండ్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పారదర్శకమైన పాలన సాగుతోందని, అవినీతికి తావు లేకుండా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసమే తమ ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోందని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అన్యాయాలను, దోపిడీని ప్రజల ముందు ఉంచాల్సిన బాధ్యత తమపై ఉందని మంత్రి చెప్పారు. ఎంతటి ఒత్తిడి వచ్చినా సరే, పేదలకు ఇచ్చిన మాట నెరవేర్చే వరకు వెనక్కి తగ్గేది లేదని ఆయన పునరుద్ఘాటించారు. రాజకీయ ఆరోపణలతో ప్రభుత్వానికి ఆటంకాలు సృష్టించాలని చూస్తే, ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారని పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముక్తాయింపుగా హెచ్చరించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అంతిమంగా ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడటమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రతి పైసా కూడా పేద ప్రజల సంక్షేమానికి ఖర్చు అవుతుందని, గతంలో మాదిరిగా ఎటువంటి అవినీతికి ఆస్కారం లేదని ఆయన భరోసా ఇచ్చారు. కేటీఆర్ లాంటి నాయకులు చేసే విమర్శలను ప్రజలు అస్సలు నమ్మరని, వాస్తవాలను అందరూ గమనిస్తూనే ఉన్నారని మంత్రి తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం ఎవరెన్ని కుట్రలు చేసినా, తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలను నిరంతరాయంగా కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల భవిష్యత్తు కోసం తాము చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, భవిష్యత్తులో కూడా ఇదే విధమైన పారదర్శకమైన పాలనను కొనసాగిస్తామని మంత్రి తన ప్రకటనలో ముగించారు.

## గంధంపల్లి ఎరువుల సబ్ సెంటర్లో రైతుల జేబులకు చిల్లులు..?

- ఎమ్మార్పీ ధరలకు తూట్లు... అదనపు వసూళ్లపై రైతుల తీవ్ర ఆరోపణలు..!
- ఇదే తంతు జరుగుతున్న... చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులపై విమర్శలు
- బిల్లులో ఒక ధర... వసూళ్లలో మరో ధర..!
- విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్..!
- ఎమ్మార్పీ బోర్డు ఒకటి... రైతు జేబుకు పడుతున్న భారం మరోటి..?
- ఒక్కో యూరియా బస్తాపై అదనపు వసూళ్లంటూ రైతుల తీవ్ర ఆరోపణలు...
- నాలుగేళ్లుగా కొనసాగుతున్న దందాపై అధికారుల మౌనం ఎందుకు..?
- బిల్లులో ఎమ్మార్పీ... చేతిలో అదనపు నగదు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు...
- రైతుల చెమట డబ్బుతో ఎవరి ఖజానా నిండుతోంది

**మహబూబాబాద్ బయ్యారం విశాల భారతి):**



బయ్యారం మండలం, గంధంపల్లి: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎరువుల పంపిణీ కేంద్రాలే కొందరి చేతుల్లో రైతుల జేబులు గుల్ల చేసే కేంద్రాలుగా మారాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బయ్యారం మండలంలోని గంధంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల సబ్ సెంటర్‌లో ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకు విరుద్ధంగా ఒక్కో యూరియా బస్తాపై రూ.10 నుంచి రూ.20 వరకు అదనంగా వసూలు చేస్తున్నారంటూ రైతులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. రైతుల అవసరాన్ని అవకాశంగా మార్చుకుని సాగిస్తున్న ఈ వ్యవహారం ఒక్కరోజు కాదు... గత నాలుగేళ్లుగా నిరాటంకంగా కొనసాగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయం రోజురోజుకూ భారంగా మారుతున్న తరుణంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులతో రైతు ఇప్పటికే తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. అలాంటి సమయంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అందాల్సిన ఎరువులపై అదనపు భారం మోపడం రైతులపై మరో దెబ్బగా మారిందని వారు వాపోతున్నారు. చిన్న మొత్తంలా కనిపించే ఈ అదనపు వసూళ్లు ప్రతి సీజన్‌లో వేలాది బస్తాల విక్రయాల ద్వారా లక్షల రూపాయలుగా మారుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.




**బిల్లులో ఒక రేటు... చేతిలో మరో రేటు..!**

గంధంపల్లి గ్రామానికి చెందిన రైతులు యాదవ రమణారెడ్డి, మాదంశెట్టి నాగేశ్వరావు మాట్లాడుతూ రైతులకు ఇచ్చే బిల్లులో మాత్రం ఎమ్మార్పీ ధరను నమోదు చేసి, వాస్తవానికి నగదు చెల్లించే సమయంలో అదనపు మొత్తం వసూలు చేస్తున్నారని ఆరోపించారు. బిల్లులు, నగదు లావాదేవీలు, స్టాక్ రిజిస్టర్లు, విక్రయ రికార్డులను పరిశీలిస్తే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. రైతుల కష్టార్జిత సొమ్మును ఇలా అదనంగా వసూలు చేయడం సహించరానిదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తనిఖీలు లేకపోవడం, చర్యలు కనిపించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని రైతులు అంటున్నారు. రైతుల ఫిర్యాదులపై జిల్లా సహకార శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే ప్రత్యేక విచారణ నిర్వహించి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై శాఖాపరంగా, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# బావబామ్మర్దుల పొలిటికల్ ఫైట్



**మొదటి పేజీ తరువాయి**

ఈ వ్యవహారంలో బీఆర్ఎస్ తరఫున హరీశ్‌రావు అప్పర్ హ్యాండ్ సాధించారన్న అభిప్రాయం బలమైన కేడర్‌లో వ్యక్తమైంది. ఇదే క్రమంలో తాజాగా కేటీఆర్ కాళేశ్వరం ఇష్యూతో కన్నెపల్లి పంపుహౌస్ వద్దకు తన అనుచరులతో తరలివెళ్లారు. గత బీఆర్ఎస్ హయాంలో ఇరిగేషన్ మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు ఈ పర్యటనలో లేకపోవడం పార్టీలో చర్చకు దారితీసింది. కాళేశ్వరం ప్రాజెక్టును ముఖ్యమంత్రి మొదలు మంత్రులంతా కూలేశ్వరం అని సెటైర్లు వేస్తుండడంతో ఆ ఇష్యూని కేటీఆర్ టేకప్ చేశారు. అప్పుల ఇష్యూలో కేటీఆర్‌కు ఆశించినంత మైలేజ్ రాలేదనే అభిప్రాయం బీఆర్ఎస్ శ్రేణుల్లోనే వినిపించింది. దీంతో ఆయన హఠాత్తుగా కన్నెపల్లి పంప్హౌస్ టూర్ చేపట్టడం వెనుక గల వ్యూహం ఇప్పుడు రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. గత ప్రభుత్వంలో ఇరిగేషన్ మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు ఈ టూర్‌లో కనిపించలేదు. సాగునీటి పారుదల అంశాల్లో, ప్రాజెక్టుల విషయంలో లోతైన అవగాహన ఉన్న హరీశ్‌రావును కేటీఆర్ ఆహ్వానించలేదా? లేకుంటే హరీశ్‌రావే ఆసక్తి చూపలేదా? లేదా ఉద్దేశపూర్వకంగానే దూరంగా ఉన్నారా? ఇలాంటి గుసగుసలు బీఆర్ఎస్‌లో మొదలయ్యాయి. అప్పుల అంశంలో హరీశ్‌రావుకు వచ్చిన మైలేజీని అధిగమించాలనే కన్నెపల్లి టూర్‌లో కేటీఆర్ అన్నీ తానై వ్యవహరించారన్న మాటలు ఆ పార్టీలో గట్టిగా వినిపిస్తున్నాయి. పోలీసులు అడ్డుకోవడం, వాగ్వాదం చోటుచేసుకోవడం, ప్రభుత్వానికి కేటీఆర్ సవాల్ విసరడం, యాభై వేల మంది రైతులతో వచ్చి మోటార్లను ఆన్ చేస్తానని ప్రకటించడం వంటి పరిణామాలతో మీడియా స్పేస్‌ను ఆయన ఆక్రమించారనే చర్చ నేతల్లో తీవ్రంగా నెలకొంది. దీనిపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీఆర్ఎస్‌లో హరీశ్‌రావు, కేటీఆర్ మధ్య కోల్డ్ వార్ జరుగుతున్నదనేది తెలంగాణభవన్‌లో బహిరంగంగా వినిపించే మాట. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా చోటుచేసుకున్న కొన్ని ఉదాహరణలు దీనికి బలం చేకూర్చినట్లయింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై కేటీఆర్ చర్చలో పాల్గొనగా.. ప్రెస్ మీట్ పేరుతో హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. బడ్జెట్‌పై చర్చలో హరీశ్‌రావు కీలక పాత్ర పోషిస్తే.. కేటీఆర్ చిట్‌చాట్ పేరుతో మీడియా ప్రతినిధులకు కొన్ని సెన్సేషనల్ ఇన్‌పుట్స్ ఇచ్చారు. ఇలాంటి ఆనవాయితీ అప్పటి నుంచీ కంటిన్యూ అవుతున్నది. రాష్ట్రంలో పర్యటనలు మొదలైన సమయంలో కేటీఆర్ నియోజకవర్గాలవారీగా సన్నాహక సమావేశాలతో జిల్లాల్లో పర్యటించారు. కేవలం సిద్దిపేట్, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు హరీశ్‌రావు పరిమితం కాకుండా.. సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ వంటి ప్రాంతాల్లో పర్యటించడం గమనార్హం. ఒకరిపై మరొకరు అప్పర్ హ్యాండ్ సాధించేలా, మీడియాలో స్పేస్‌ను ఆక్యుపై చేసేలా కంటికి కనిపించని తీరులో పోటాపోటీగా వ్యవహరిస్తున్నారనే టాక్ బీఆర్ఎస్ కేడర్ లో నెలకొన్నది. ఇప్పుడు అప్పుల ఇష్యూలో, కాళేశ్వరం ఇష్యూలోనూ అదే కనిపించిందని వారు అనుకుంటున్నారు. కన్నెపల్లి టూర్‌తో ఒక రోజంతా కేటీఆర్ హైలైట్ కావడంతో హరీశ్‌రావు తదుపరి చర్యలు, టేకప్ చేయబోయే ఇష్యూ ఏంటనేది బీఆర్ఎస్ లో ఆసక్తికరంగా మారింది. పార్టీలో నేతల మధ్య వివాదాలు, నియోజకవర్గాల్లో ప్రత్యర్థి పార్టీతో గట్టి పోటీ ఉన్న సమయాల్లో హరీశ్‌రావుకు బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ బాధ్యతలు అప్పజెప్పేవారు. సమస్యను పరిష్కరించడంపై దిశానిర్దేశం చేసి అక్కడికి పంపేవారు. దీంతో ఆయనకు పార్టీలో ట్రబుల్ షూటర్ అనే గుర్తింపు వచ్చింది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. బీఆర్ఎస్ హయాంలో ఇరిగేషన్ మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు కాళేశ్వరం అంశంపై రెండు వేల ఇరవై నాలుగులో అసెంబ్లీలో చర్చలో పాల్గొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అవకతవకల ఆరోపణలు రావడంతో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎంక్వయిరీకి సైతం హరీశ్‌రావు హాజరై వివరణ ఇచ్చారు. ఆ ప్రాజెక్టు ప్రస్తావనకు రావడంతోనే కేసీఆర్, హరీశ్‌రావు పేర్లు బీఆర్ఎస్ శ్రేణులకు గుర్తుకొస్తాయి. ఇప్పుడు కేటీఆర్ ఆ ఇష్యూను టేకప్ చేయడం, కన్నెపల్లి పంప్హౌస్ టూర్‌లో హరీశ్‌రావు కనిపించకపోవడం సరికొత్త చర్చకు, అనుమానాలకు తావిచ్చినట్లయింది. రాజకీయ అడుగులు వేయడంలో ఇద్దరు నేతలు ఎవరికి వారు సిద్ధాంతపరంగా ప్రయత్నిస్తుండటం ఇప్పుడు కార్యకర్తల్లో గందరగోళం పెంచుతోంది. కేసీఆర్ నాయకత్వంలోనే పని చేస్తున్నా, క్షేత్రస్థాయిలో వీరిద్దరి శైలి మాత్రం భిన్నంగా కనిపిస్తూ పార్టీపై ప్రభావం చూపిస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి పార్టీని ఎలా బలోపేతం చేయాలనే విషయంలో ఇద్దరి మధ్య భిన్నమైన వ్యూహాలు ఉన్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కేటీఆర్ తనదైన శైలిలో సోషల్ మీడియా వేదికగా, యువతను ఆకర్షించే విధంగా ప్లాన్ చేసుకుంటుంటే, హరీశ్‌రావు మాత్రం క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను కలుపుకొని ముందుకు సాగుతున్నారు.

## డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు

**వృక్షారోపణ నిర్వహించి నివాళులర్పించిన బీజేపీ నాయకులు**



**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మండలంలోని కనకమామిడి గ్రామంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ వృక్షారోపణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సంవెల్లి ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఆయన ఆదర్శాలను అనుసరిస్తూ సమాజ సేవతో పాటు పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవిత విశేషాలు, దేశ నిర్మాణంలో ఆయన పాత్ర, విద్యా రంగానికి చేసిన సేవలను నాయకులు గుర్తు చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మొయినాబాద్ మండల అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రాయనోళ్ల రవీందర్ యాదవ్, మండల ఉపాధ్యక్షుడు శ్రీధర్, రంగారెడ్డి జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి అత్తాపురం శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు జున్‌జూర్ వెంకటేష్, ప్రభాకర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, నాగేష్, పల్లె రాంరెడ్డి, పార్టీ కార్యకర్తలు జంగయ్య, సుధాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలి

**స్టేషన్ ఘనపూర్,విశాలభారతి:** రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త నిబద్ధతతో పనిచేయాలని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు.సోమవారం స్టేషన్ ఘనపూర్‌లో నిర్వహించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుల పరిచయ సమావేశంలో ఆయన మాట్లాడారు.పీసీసీ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని కమిటీలను ఏర్పాటు చేసిందని, పార్టీ నిర్ణయాలపై అనవసర ప్రచారాలను నమ్మవద్దని అన్నారు. తాను ఏ పార్టీలో ఉన్నా ఆ పార్టీ విధానాలకు కట్టుబడి పనిచేశానని, నియోజకవర్గ అభివృద్ధి, కాంగ్రెస్ పార్టీ బలోపేతమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.అందరూ కుటుంబ సభ్యుల్లా కలిసి పనిచేసి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని, చౌకబారు రాజకీయాలకు తావులేదని హెచ్చరించారు. అలాగే బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలపై విమర్శలు చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్‌రెడ్డి, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, హన్మకొండ, జనగామ జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, మండల అధ్యక్షులు, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# హైదరాబాద్ టూరిజంపై సీఎం ఫోకస్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



హైదరాబాద్ నగరం పర్యాటక రంగంలో ప్రపంచస్థాయి గుర్తింపు పొందాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గట్టిగా నిర్ణయించుకున్నారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో పర్యాటక శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన ఈ సమీక్షా సమావేశంలో ఆయన కీలకమైన ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ నగరం కోర్ అర్బన్ ప్రాంతంలో టూరిజాన్ని విస్తృతంగా అభివృద్ధి చేయడం ద్వారా ఆదాయాన్ని పెంచడంతో పాటు ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పాత చారిత్రక కట్టడాలు సహా ప్రకృతి సిద్ధమైన ప్రదేశాలను ఆధునిక పద్ధతుల్లో తీర్చిదిద్దాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. పర్యాటక శాఖ కార్యకలాపాలను అత్యంత వేగంగా ముందుకు తీసుకువెళ్లాలని, ఈ దిశగా అవసరమైన కార్యాచరణ ప్రణాళికలను వెంటనే సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేసినట్లుగా అధికార వర్గాల ద్వారా స్పష్టమైన సమాచారం అందుతోంది. తారామతి బారామతి ప్రాంగణాలను మరింతగా అభివృద్ధి చేయాలని, దుర్గం చెరువును పూర్తిస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నగరం నడిబొడ్డున ఉన్న మంజీరా అలాగే దిల్ కుషా గెస్ట్ హౌజ్‌లను ఆధునికీకరించడం ద్వారా పర్యాటకులను ఆకర్షించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. హైదరాబాద్‌లో ఉన్న పర్యాటక ప్రాంతాలకు జాతీయ అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడానికి సమర్థవంతమైన మార్కెటింగ్ వ్యూహాలను రూపొందించాలని చెప్పారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాకుండా, నగర జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ వేగంగా పూర్తి చేయడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని ఆయన అధికారులకు గుర్తు చేశారు. నగరం పరిధిలోని అటవీ భూములను పర్యాటక శాఖతో కలిసి ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలని రేవంత్ రెడ్డి అధికారులకు తెలిపారు. ఫ్యూచర్ సిటీలో ఉన్న అటవీ భూములను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలని ఆయన ఆదేశించారు. అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగరంలో మరిన్ని పార్కులను అభివృద్ధి చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధి కూడా సాధ్యమవుతుందని చెప్పారు. అటవీ ప్రాంతాల్లో సందర్శకుల కోసం అవసరమైన వసతులను కల్పిస్తూనే, పచ్చదనాన్ని కాపాడటంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రకృతిని ఇష్టపడే సందర్శకులకు ఈ ప్రాజెక్టులు ఒక ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తాయని, వీటిని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ నగరంలోని పురానాపూల్ వంటి వారసత్వ సంపదను కాపాడుతూ వాటిని పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఇటువంటి చారిత్రక బ్రిడ్జిల అభివృద్ధి కోసం తక్షణమే సమగ్ర ప్రణాళికలను రూపొందించి వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని చెప్పారు. అభివృద్ధి పనుల అనంతరం అవసరమైతే ట్రాఫిక్‌ను మరో మార్గం నుంచి మళ్లించి పర్యాటకులకు ఇబ్బంది లేకుండా అవకాశం కల్పించాలని సూచించారు. పురాతన కట్టడాల పరిరక్షణతో పాటు వాటిని పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడం ద్వారా నగర చరిత్రను ప్రపంచానికి చాటిచెప్పవచ్చని ఆయన వివరించారు. వారసత్వ సంపదను పర్యాటకానికి అనుకూలంగా మార్చడం వల్ల వచ్చే ఆర్థిక ప్రయోజనాలు నగర అభివృద్ధికి దోహదపడతాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఈ పనులను పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రాబోయే డిసెంబరు నెలలో నిర్వహించబోయే గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్ కోసం ఏర్పాట్లు వెంటనే ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం కమిటీలను ఏర్పాటు చేసి పనులను విభజించాలని తెలిపారు. టూరిజం హబ్ డెవలప్మెంట్ పథకం కింద వికారాబాద్ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు. వికారాబాద్ జిల్లాలోని వీరభద్రస్వామి దేవాలయాన్ని ఆధునికీకరించాలని, దీని కోసం యాదాద్రి తరహాలో ఆలయ కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలో పర్యాటక మౌలిక సదుపాయాల కల్పన ద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి దొరుకుతుందని చెప్పారు. పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు గ్లోబల్ సమ్మిట్ ఒక గొప్ప వేదికగా మారుతుందని, దీనిని విజయవంతం చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ కీలక సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు కె.రామకృష్ణా రావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్‌రంజన్ పాల్గొన్నారు. పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ సహా ఇతర ఉన్నతాధికారులు కూడా ఈ సమీక్షలో పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరంలో పర్యాటక ప్రాజెక్టుల అమలు కోసం అవసరమైన బడ్జెట్ కేటాయింపులపై చర్చించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను అనుసరించి ప్రతి ప్రాజెక్టును నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధం కావాలని ముఖ్యమంత్రి కోరారు. నిర్ణయించిన లక్ష్యాల సాధనలో ఎటువంటి జాప్యం ఉండకూడదని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ కార్యాలయాల మధ్య సమన్వయం లోపించకుండా చూడటం ద్వారా ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను కోరుతూ సమావేశాన్ని విజయవంతంగా ముగించారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ నగరం పర్యాటక పటంలో అగ్రస్థానంలో నిలవాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. నగరంలోని అన్ని పర్యాటక కేంద్రాలను ఆధునీకరించడం ద్వారా ప్రయాణీకుల సంఖ్యను పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఎకో టూరిజం, వారసత్వ సంపద, ఆలయాల అభివృద్ధి అనే మూడు అంశాల మీద ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించింది. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయితే హైదరాబాద్ నగరం పర్యాటక హబ్‌గా మారుతుందనడంలో సందేహం లేదు. ప్రభుత్వ సంకల్పానికి అధికారుల కృషి తోడైతే పర్యాటక రంగంలో తెలంగాణ రాష్ట్రం సరికొత్త రికార్డులను సృష్టిస్తుంది. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడంతో పాటు, నగర ఆర్థిక స్థితిని బలోపేతం చేసేందుకు ఈ పర్యాటక ప్రాజెక్టులు ఎంతో కీలకంగా మారుతాయని ప్రభుత్వం బలంగా విశ్వసిస్తోంది. పర్యాటక రంగం అభివృద్ధికి ప్రభుత్వం చూపుతున్న ఈ చొరవ పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పర్యాటక శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రాజెక్టుల సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. వికారాబాద్ ఆలయ అభివృద్ధి, నగరంలోని అటవీ ప్రాజెక్టులు, చారిత్రక బ్రిడ్జిల పునరుద్ధరణ వంటి పనులు వేగంగా మొదలుకానున్నాయి. ఈ అభివృద్ధి పనుల ద్వారా హైదరాబాద్ నగరం పర్యాటకులకు స్వర్గధామంగా మారనుందని ఆశాభావం వ్యక్తమవుతోంది. పర్యాటక రంగం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రైవేట్ సంస్థలకు ప్రభుత్వం పిలుపునిస్తోంది. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు రాష్ట్ర పర్యాటక రంగానికి కొత్త కళను తీసుకువస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తి కావాలంటే ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని, అందరూ కలిసి తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరుకుంటున్నారు.

# ఇంటర్మీడియట్ కోర్సు అడ్మిషన్స్ ప్రారంభం



**అడవిదేవులపల్లి, విశాలభారతి:** 202627 విద్యాసంవత్సరానికి గాను మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఈ ఏడాది కొత్తగా ఎంపీ హెచ్ డబ్ల్యు కోర్సును ప్రభుత్వం ప్రారంభించిందని కస్తూర్బా పాఠశాల ఎస్ఓ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఈ కోర్సులో చేరడానికి అర్హులని పేర్కొన్నారు.ఎంపీ హెచ్ డబ్ల్యు కోర్సులో కేవలం 40 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని,ఆసక్తి గల అర్హులైన విద్యార్థినులు వెంటనే తమ దరఖాస్తులను సమర్పించి, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ ఎంపీ హెచ్ డబ్ల్యు కోర్సును బోధించడానికి తాత్కాలిక పద్ధతిలో పనిచేయుటకు అర్హులైన మహిళా గెస్ట్ అధ్యాపకుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. విద్యా అర్హత ఎంఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులై ఉండాలి లేదా బిఎస్సి నర్సింగ్ పూర్తి చేసి 10 సంవత్సరాల బోధనా పని అనుభవం కలిగి ఉండాలని అన్నారు.అర్హులైన మహిళా అభ్యర్థులు ఈ నెల 9వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కోర్సు ప్రవేశాలు అధ్యాపకుల నియామకానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం 7780648942 నంబర్ ను సంప్రదించవచ్చని ఎస్ఓ నాగలక్ష్మి తెలిపారు.

# జర్నలిస్టుల పిల్లల ఫీజు రాయితీకై ఎంఈఓకి వినతి



**అడవిదేవులపల్లి విశాలభారతి:** మండల జర్నలిస్టుల యూనియన్ సభ్యులు సోమవారం మండల విద్యాశాఖాధికారిని వరలక్ష్మికి వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ సమాజంలో ప్రభుత్వం,ప్రజల మధ్య వారధిగా ఉంటూ, నిరంతరం ప్రజల సమస్యలను వెలుగులోకి తెస్తూ శ్రమిస్తున్న జర్నలిస్టుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుకుంటున్న జర్నలిస్టుల పిల్లల విద్యాభ్యాసానికి 50% ఫీజు రాయితీ (ఫీజు కన్సెషన్) కల్పించేలా ప్రభుత్వ పరంగా తగిన ఆదేశాలు జారీ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగానే అడవిదేవులపల్లి మండలంలో కూడా ఎంఈఓ కి వినతి పత్రం సమర్పించడం జరిగిందని తెలిపారు.ఈ వినతిపత్రాన్ని ఉన్నతాధికారులైన జిల్లా విద్యాశాఖాధికారి డిఈఓ దృష్టికి తీసుకెళ్లి,జర్నలిస్టుల పిల్లలకు న్యాయం జరిగేలా చూడాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో అడవిదేవులపల్లి జర్నలిస్ట్ యూనియన్ సభ్యులు కొట్టే శ్రీనివాసరావు,కేశబోయిన. నరసింహ,పోలు పుల్లారెడ్డి, రామకృష్ణారెడ్డి,చింతల కోటి, సన్నాయిల రాము,కొ్ట్ర జయానందరావు,ముళ్లపాటి అనిల్,కొ్ట్ర.గోవర్ధన్,కలకొండ హరీష్,నారాయణ,శీలం వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు సోదరులకు ఆహ్వానం



**నిజామాబాద్, విశాలభారతి:** మాక్లూర్ మండల అన్ని గ్రామాల రైతు సోదరులందరికీ తెలియజేయునది ఏమనగా, తేదీ: ఏడు. ఏడు 2026 (మంగళవారం)సమయం: ఉదయం 9:00 గంటలకు స్థలం: రైతు వేదిక, చిన్నాపూర్ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న హార్టికల్చర్ పథకాలు మరియు వివిధ సబ్సిడీలపై అవగాహన సదస్సు నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా హార్టికల్చర్ అధికారి ముఖ్య అతిథులుగా విచ్చేసి, రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సబ్సిడీలు, పథకాలు మరియు వాటి ప్రయోజనాల గురించి వివరించనున్నారు. కావున పరిసర గ్రామాల రైతులు అన్ని గ్రామాల సర్పంచ్లు,ముఖ్య నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని, ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన పొందుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మనవి. మాక్లూర్ సొసైటీ చైర్మన్ బుర్రోళ్ళ అశోక్ తెలిపారు.

# నూతన సర్పంచ్ భూక్య సంతోష్‌కు ఘన సన్మానం

**మాజీ మంత్రి మోత్కుపల్లి, చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి హాజరు**



**తుర్కపల్లి, విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని జ్యోతిరామ్ తండలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ భూక్య సంతోష్ ఆహ్వానం మేరకు మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు మరియు మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్య సంతోష్ వారిద్దరిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు, చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి సర్పంచ్ భూక్య సంతోష్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రజల సహకారంతో కృషి చేయాలని, గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్య సంతోష్ అతిథులకు ఆత్మీయ స్వాగతం పలికి, గ్రామ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు, మహిళలు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వీల్స్ ట్రాక్టర్స్ రోడ్లు పై నడిపిన వారి పై చర్యలు తప్పవు

**పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్**

**వాజేడు జులై 6 విశాల భారతి;** ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల ట్రాక్టర్ డ్రైవర్లకు మరియు రైతులందరికీ ముఖ్య గమనిక రైతులు తమ వీల్స్ ట్రాక్టర్స్ ను పొలం పనులకు ఉపయోగించి అలాగే మట్టితో బురదతో తారు రోడ్లపైకి వచ్చి రోడ్లపై మట్టి పడేస్తూ వెళ్తున్నారు. దీనివలన రోడ్డుపై పడిన బంక మట్టి అంటుకుపోయి వర్షం పడినప్పుడు అట్టి రోడ్డుపై వెళ్లే ద్విచక్ర వాహన దారులు జారిపడే ప్రమాదాలకు గురవుతున్నారు. వీల్స్ చక్రాలు తారు రోడ్డుపై వెళ్లడంతో రోడ్డు డ్యామేజ్ అవుతుందని అందువలన వీల్స్ ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు మరియు సంబంధిత రైతులు వారి ట్రాక్టర్ల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోగలరని లేనియెడల వారిపై చర్యలు తీసుకో బడతాయని పేరూరు ఎస్సై గుర్రం కృష్ణా ప్రసాదు హెచ్చరిక జారీ చేశారు.

# సీనియర్ రిపోర్టర్ మృతిపై ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సంతాపం

**కుటుంబానికి ఆర్థిక సాయం, అండగా ఉంటామని భరోసా**

**తుర్కపల్లి, విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలానికి చెందిన ప్రజాతంత్ర సీనియర్ రిపోర్టర్ ఎం. చంద్రం అనారోగ్యంతో మృతి చెందడం పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీరరెడ్డిపల్లి గ్రామంలోని చంద్రం స్వగృహానికి చేరుకున్న ఎమ్మెల్యే, ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి తన వంతుగా ఆర్థిక సహాయం అందజేసి, ఈ క్లిష్ట సమయంలో అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, "రిపోర్టర్ చంద్రం గారి మృతి అత్యంత బాధాకరం. ఎక్కడ కలిసినా ఆప్యాయంగా పలకరించి, మంచి మనసుతో సూచనలు చేసే వ్యక్తిగా ఆయన అందరి మన్ననలు పొందారు. జర్నలిజం పట్ల నిబద్ధతతో పనిచేసిన ఆయన మరణం తుర్కపల్లి మండల మీడియా రంగానికి తీరని లోటు. భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటాం" అని అన్నారు.



# వాసలమర్రిలో మార్నింగ్ వాక్‌తో అభివృద్ధి పనుల పరిశీలన

**వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు విప్ బీర్ల ఐలయ్య ఆదేశం**



**తుర్కపల్లి , విశాల భారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసలమర్రి గ్రామంలో సోమవారం ఉదయం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, సంబంధిత అధికారులతో కలిసి మార్నింగ్ వాక్ నిర్వహించి గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించిన ఆయన, ఇంకా ప్రారంభం కాని ఇళ్లకు సంబంధించిన కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో సమన్వయం చేసుకుని వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ఇళ్లను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలించిన విప్ బీర్ల ఐలయ్య, పనుల్లో జాప్యానికి తావు లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. విద్యార్థులకు iమెరుగైన విద్యా వాతావరణం కల్పించేలా అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో చివరి దశలో ఉన్న హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణాన్ని కూడా పరిశీలించిన ఆయన, మిగిలిన పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అదేవిధంగా గ్రామంలోని తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ తదితర మౌలిక సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనలో ఎలాంటి లోటు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఫాంల పంపిణీ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి

**రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి**



**మణుగూరు, విశాలభారతి :** ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఎన్యుమరేషన్ ఫాం ల పంపిణీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ, డిజిటలైజేషన్ పై అన్ని జిల్లాల కలెక్టర్లు మరియు ఈ ఆర్ ఓ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గడువులోగా ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాల వారీగా ఇప్పటివరకు పూర్తి చేసిన ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ వివరాలు సమీక్షించారు. బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓలు) తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి ఫాం లు అందివ్వాలని అన్నారు. బిఎల్ఓ లు మాత్రమే ఫాంలు పంపిణీ చేయాలని, బిఎల్ఎ లు గానీ, ఇతర రాజకీయ పార్టీల వారికి గానీ ఎన్యుమరేషన్ ఫాం లు పంపిణీ చేసే అధికారం లేదని స్పష్టం చేశారు. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియ పై సందేహాలు నివృత్తి చేయడానికి అవసరమైతే అదనపు హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పై ఎప్పటికప్పుడు వివిధ మీడియా మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం కల్పించాలని పేర్కొన్నారు. మణుగూరు తాసిల్దార్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఈ వీసీలో పినపాక నియోజకవర్గం ఈఆర్ఓ మరియు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వీసీలో భాగంగా ఆయన మాట్లాడుతూ పినపాక నియోజకవర్గంలో ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ ప్రక్రియ 90 శాతం పూర్తయిందన్నారు. అన్ని నియమాలు పాటిస్తూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తామని, డిజిటల్ ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని, ఎప్పటికప్పుడు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు తహసీల్దార్ నరేష్, ఎలక్షన్ డిటి అనూష, ఆర్ ఐ లు రామారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్

- **పాఠశాలల్లో మౌలిక వసతులపై అధికారులకు ఆదేశాలు**



**మొయినాబాద్, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ) యెంకేపల్లి వార్డులో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఫారాల పంపిణీ, ఫారాల నింపడం, వాటిని డిజిటలైజ్ చేసే ప్రక్రియపై బీఎల్‌వోలను అడిగి తెలుసుకుని తనిఖీ నిర్వహించారు.అనంతరం యెంకేపల్లి హైస్కూల్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్‌కు 11వ వార్డు కౌన్సిలర్ మహేష్ పాఠశాలలో కొత్త మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని, అలాగే ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థకు చేరిన గదిని కూల్చివేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ (ఏఈఆర్ఓ), వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి



**సికింద్రాబాద్, విశాల భారతి :** భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతిని నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బౌద్ధనగర్ డివిజన్ నాయకులతో కలిసి మేకల కీర్తి హర్ష కిరణ్ ఘన నివాళులు అర్పించారు , వారి స్మృత్యర్థం ఒక మొక్కను నాటడం జరిగినది. “ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జండాలు,ఇద్దరు ప్రధానులు ఉండకూడదు" అంటూ కాశ్మీర్ పూర్తి విలీనం కోసం, దేశ సమగ్రత కోసం ఆయన చేసిన పోరాటము, త్యాగము చిరస్మరణీయం. గొప్ప మేధావిగా, దార్శనిక నాయకుడిగా దేశ సేవలో ఆయన చూపిన మార్గం మనందరికీ ఎంతో స్ఫూర్తిదాయకం అని మేకల కీర్తిహర్షకిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు అరవింద్ ,సతీష్, శ్యాంరాజ్ ,భిక్షపతి, సంగం జగదేశ్వర్ నేత ,వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# సర్కిల్ 51 ప్రజావాణికి 6 అర్జీలు




- **టౌన్ ప్లానింగ్‌పై అధికంగా ఫిర్యాదులు**
- **డీసీ చాముండేశ్వరి వెల్లడి**

**సైబరాబాద్ - విశాల భారతి**

ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 కార్యాలయంలో సోమవారం డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి మొత్తం 6 ఫిర్యాదులను స్వీకరించారు.విభాగాల వారీగా పరిశీలిస్తే.. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 5 ఫిర్యాదులు రాగా, పారిశుధ్య విభాగానికి 1 ఫిర్యాదు అందింది. రెవెన్యూ, యూబీడీ, ఇంజనీరింగ్ మెయిన్, యూసీడీ, వెటర్నరీ విభాగాలకు సంబంధించి ఒక్క ఫిర్యాదు కూడా అందలేదు. అర్జీదారులతో నేరుగా మాట్లాడిన డీసీ చాముండేశ్వరి.. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ సమస్యలపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని, అక్రమ నిర్మాణాలు, అనుమతులకు సంబంధించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పారిశుధ్య సమస్యపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి అర్జీకి రసీదు ఇచ్చి, పరిష్కారానికి గడువును నిర్ణయించి అర్జీదారులకు సమాచారం అందిస్తామని డీసీ తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్కిల్ 51 టౌన్ ప్లానింగ్, శానిటేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**పశు వైద్య అధికారి ఉజ్వల**



**పినపాక, విశాలభారతి :** ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెంపుడు జంతువులకు వ్యాక్సినేషన్ టీకాలు వేసే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం గ్రామంలో ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేసినట్టుగా పశు వైద్యురాలు ఉజ్వల తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెటర్నరీ వైద్యురాలు ఉజ్వల తెలియజేశారు. పెంపుడు జంతువులు, పశువులకు సకాలంలో టీకాలు వేయించడం, వాటి ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. అనారోగ్యంతో ఉన్న జంతువులను తాకేటప్పుడు రక్షణ చర్యలు పాటించాలని, పాలు, మాంసాహార పదార్థాలను పరిశుభ్రంగా వండి తీసుకోవాలని సూచించారు. పశువుల షెడ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా జూనోటిక్ వ్యాధుల వ్యాప్తిని నివారించవచ్చని తెలిపారు. జంతువులలో అసాధారణ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప వెటర్నరీ వైద్యులను సంప్రదించాలని కోరారు. ప్రజలు అవగాహనతో జాగ్రత్తలు పాటిస్తే జూనోసిస్ వ్యాధులను సమర్థవంతంగా నియంత్రించవచ్చని వెటర్నరీ వైద్యురాలు శృతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వాగ బోయిన చందర రావు, ఉప సర్పంచ్ గంగిరెడ్డి సంపత్, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలి

**సిపిఎం మండల కార్యదర్శి గంగాదేవి సైదులు**



**చౌటుప్పల్ విశాలభారతి:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల సందర్భంగా నిరుద్యోగ యువతకు ఇచ్చిన ఉద్యోగ హామీలను వెంటనే అమలు చేయాలని సిపిఎం చౌటుప్పల్ మండల కార్యదర్శి గంగాదేవి సైదులు డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వం లక్ష ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. కానీ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీల అమలులో నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. దేశంలో, రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ పోస్టులను తక్షణమే భర్తీ చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన కోరారు. ప్రభుత్వాలు ఎన్నికల హామీలను తక్షణమే నెరవేర్చి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని, లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలు చేపడతామని ఒక ప్రకటనలో హెచ్చరించారు.

# ఎస్ఐఆర్ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ – బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కానుగుల మహేష్**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కానుగుల మహేష్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) ఆదేశాల మేరకు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, వాటిని ఎలా నింపాలనే విషయంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతి అర్హుడైన ఓటరు తప్పనిసరిగా వివరాలు నమోదు చేసుకుని ఓటరు జాబితాలో తన పేరు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు సోహైల్ రాజు, బీఎల్‌వో జగదీష్, స్థానిక ఓటర్లు పాల్గొన్నారు.

# అబ్దుల్లాపూర్‌మెట్‌లో అర్ధరాత్రి చోరీయత్నం

- **ఫాస్ట్ ఫుడ్ సెంటర్ పైకప్పు కోసి బేకరీలోకి చొరబడిన దుండగులు**
- **కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్ బస్టాండ్ సమీపంలో ఉన్న బి.టెక్ బైట్స్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు పైకప్పు స్టీల్ షీట్‌ను కత్తిరించి లోపలికి ప్రవేశించి చోరీకి యత్నించిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చినట్లు అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 5 రాత్రి దుకాణానికి తాళం వేసి వెళ్లిన యజమాని మహ్మద్ నదీమ్‌కు, మరుసటి రోజు ఉదయం ఉద్యోగిని కాథి పల్లవి ఫోన్ చేసి షాపు పైకప్పు కోసి ఉన్న విషయాన్ని తెలియజేసింది. అక్కడికి వెళ్లి పరిశీలించగా దుండగులు ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లోకి ప్రవేశించడంతో పాటు, అక్కడి నుంచి పక్కనే ఉన్న బేకరీ గోడకు రంధ్రం చేసి అక్కడ కూడా చోరీకి యత్నించినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించినట్లు ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితులను గుర్తించే చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

# ఘనంగా శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు



**మూటకొండూరు, విశాలభారతి:** మూటకొండూర్ మండల బీజేపీ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఎల్లంల శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల మురళీధర్ రెడ్డి హాజరై శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ సమైక్యత, జాతీయత కోసం శ్యామ ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి కార్యకర్త ఆదర్శంగా తీసుకొని ప్రజాసేవలో ముందుండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చిర రవీందర్, గాజుల బాలరాజు గౌడ్, పల్ల జితేందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మల్ల అశోక్, మండల ఉపాధ్యక్షులు గడ్డం రమేష్, మండల కార్యదర్శి పేరబోయిన నరేష్, బూత్ అధ్యక్షులు రేగు ఉపేందర్, క్రాంతి కుమార్, గణేష్, బల్ధా నర్సింహులునాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయవాడ జాతీయ రహదారి సర్వీస్ రోడ్లపై అక్రమ పార్కింగ్‌లు, ఫుట్‌పాత్ ఆక్రమణలు





- **ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం – పోలీసు, జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారుల విజ్ఞప్తి**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**

విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 65) వెంట ఉన్న సర్వీస్ రోడ్లపై రోజురోజుకూ పెరుగుతున్న అక్రమ పార్కింగ్‌లు, ఫుట్‌పాత్ ఆక్రమణల కారణంగా ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చిందని స్థానిక ప్రజలు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని వారు వాపోతున్నారు. ఆటోనగర్, భాగ్యలత, హయత్‌నగర్ బస్టాండ్, సూర్యనగర్ కమాన్, లక్ష్మారెడ్డిపాలెం, పెద్ద అంబర్‌పేట్ ఓఆర్ఆర్ సమీప ప్రాంతాలు, సంపూర్ణ హోటల్ పరిసరాలు, అబ్దుల్లాపూర్‌మెట్ మైసమ్మ ఆలయం నుంచి కొత్తగూడ చౌరస్తా వరకు సర్వీస్ రోడ్లపై భారీ లారీలు, గూడ్స్ వాహనాలు, ట్రక్కులు, ఇతర నాలుగు చక్రాల వాహనాలను గంటల తరబడి నిలిపివేయడం వల్ల రహదారులు పూర్తిగా ఇరుకుగా మారుతున్నాయి. దీంతో సర్వీస్ రోడ్లపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఆటోలు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు కూడా సకాలంలో వెళ్లలేని పరిస్థితులు నెలకొంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిపై ట్రాఫిక్ ఒత్తిడి పెరిగి తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని, ప్రతిరోజూ ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రయాణికులు విలువైన సమయాన్ని కోల్పోతున్నారని వాహనదారులు పేర్కొంటున్నారు. ఇదే కాకుండా సర్వీస్ రోడ్ల వెంట ఫుట్‌పాత్‌లను ఆక్రమించి అనుమతులు లేకుండా తోపుడుబండ్లు, తాత్కాలిక వ్యాపారాలు, ఇతర నిర్మాణాలు ఏర్పాటు చేయడం వల్ల రహదారులు మరింత ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతోందని ప్రజలు చెబుతున్నారు. పాదచారులు ఫుట్‌పాత్‌లపై నడవలేక రహదారులపైనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడి ప్రమాదాల ముప్పు పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ పార్కింగ్‌లపై ట్రాఫిక్ పోలీసులు అప్పుడప్పుడు చలాన్లు విధిస్తున్నప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. జరిమానాలతో సరిపెట్టకుండా నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలను టోవింగ్ చేసి స్వాధీనం చేసుకోవడం, పునరావృతంగా నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అదేవిధంగా జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఫుట్‌పాత్‌లు, సర్వీస్ రోడ్లపై జరుగుతున్న ఆక్రమణలను వెంటనే తొలగించి, భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి విజయవాడ జాతీయ రహదారి వెంట ఉన్న సర్వీస్ రోడ్లపై అక్రమంగా పార్కింగ్ చేస్తున్న వాహనాలపై, ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తున్న వారిపై ఎలాంటి రాజకీయ, ఇతర ఒత్తిళ్లకు లోనుకాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే అక్రమ పార్కింగ్‌లు, ఫుట్‌పాత్ ఆక్రమణలను పూర్తిగా నిర్మూలించి సర్వీస్ రోడ్లను ప్రజలకు సురక్షితంగా, నిరంతరం అందుబాటులో ఉంచేలా సంబంధిత శాఖలు సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. ప్రజల ప్రాణాలకు, రహదారి భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ తక్షణ చర్యలు తీసుకుంటేనే ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానికులు, వాహనదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## తెలంగాణ భవన్‌లో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి వేడుకలు

- **ఆయన ఆశయాలు నేటి యువతకు ఆదర్శం – డాక్టర్ వీరమల్ల రామ్ నరసింహ గౌడ్**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** భారత మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎల్. రమణ, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్ కుమార్, రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్‌లతో కలిసి గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ వీరమల్ల రామ్ నరసింహ గౌడ్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరమల్ల రామ్ నరసింహ గౌడ్ మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్ రామ్ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన మహోన్నత నాయకుడని కొనియాడారు. స్వాతంత్ర్య సమరంలో సత్యాగ్రహం, శాసనోల్లంఘన ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమం వంటి అనేక పోరాటాల్లో మహాత్మా గాంధీతో కలిసి పాల్గొని దేశ స్వాతంత్ర్యం కోసం విశేష సేవలందించారని గుర్తు చేశారు. బాబూజీగా ప్రజల మన్ననలు పొందిన జగ్జీవన్ రామ్ సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాసేవకు ప్రతీకగా నిలిచారని, ఆయన అనుసరించిన విలువలు, సంస్కరణలు, ప్రజాసేవా దృక్పథాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని డాక్టర్ వీరమల్ల రామ్ నరసింహ గౌడ్ పేర్కొన్నారు. బాబు జగ్జీవన్ రామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయ సాధనే నిజమైన నివాళి అని ఈ సందర్భంగా పలువురు నాయకులు పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

- **ప్రతి అర్హుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి – ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచన**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని బూత్ నెం. 281, కమలానగర్ సంక్షేమ సంఘం భవనంలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి బూత్‌లో జరుగుతున్న నమోదు, సవరణ ప్రక్రియను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. అర్హులైన ప్రతి ఓటరు తమ పేరు ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా, అలాగే అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలు చేసుకునేలా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, అర్హత ఉన్న ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలని కళ్లెం నవజీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ బూత్ ఏజెంట్ గాండ్ల సందీప్, కాలనీ అధ్యక్షుడు మదన్, కాలనీ ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సంగ్రామ్, వెంకటేష్ గౌడ్, పుష్పాంజలి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత అదృశ్యం

- **రాజేంద్రనగర్ ఠాణాలో కేసు నమోదు**



**విశాల భారతి, రాజేంద్రనగర్:** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుద్వేల్ కరుణాలయం ప్రాంతానికి చెందిన వివాహిత సోమవారం నుంచి కనిపించకుండా పోయింది. పోలీసుల కథనం ప్రకారం.. కరుణాలయంలో నివాసముండే హబీబా (34), భర్త ముహమ్మద్ ఇర్ఫాన్, సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. బంధువుల ఇళ్లు, తెలిసిన వారి వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం భర్త ముహమ్మద్ ఇర్ఫాన్ రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మహిళ చివరిసారిగా కనిపించిన కరుణాలయం పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను సేకరించి పరిశీలిస్తున్నారు. అదృశ్యమైన మహిళ ఆచూకీ తెలిసిన వారు రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు గానీ, డయల్ 100కు గానీ సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

## ఓఆర్ఆర్‌పై కారులారీ ఢీ

- **సాఫ్ట్ ఉద్యోగి దుర్మరణం, భార్యకు గాయాలు**



**రాజేంద్రనగర్ విశాల భారతి;** ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. శంషాబాద్ పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ జిల్లా యేరుపల్లి గ్రామానికి చెందిన చల్లా రాఘవేంద్రప్రసాద్ కుటుంబంతో కలిసి కారులో హైదరాబాద్ వస్తుండగా సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు పెద్దగోల్కొండ ఎగ్జిట్ 15 వద్ద ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో కారు ముందు సీట్లో కూర్చున్న చల్లా మనోహర్ (25) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రాఘవేంద్రప్రసాద్ భార్య భవాని (31) కు గాయాలు కావడంతో ఆమెను ఆసుపత్రికి తరలించారు. మృతుడి బావ చత్రాది సత్యరామ లింగేశ్వరప్రసాద్ ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

- **పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది – ఎమ్మెల్యే**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ (CMRF) చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి చెందిన గోశిక మణెమ్మ మరియు సందుపట్ల చారిలకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా అందజేసి, వారి కుటుంబాలకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక చేయూత అందిస్తూ అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్, అబ్దుల్లాపూర్‌మెట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బింగి దేవదాస్ గౌడ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్యానికి ఓటే పునాది

- **ప్రతి విద్యార్థి ఎన్నికల ప్రక్రియను తెలుసుకోవాలి**
- **ప్రధానోపాధ్యాయురాలు డి. కోటేశ్వరి**
- **ముత్యాలమ్మగూడెం గురుకుల పాఠశాలలో వినూత్న మాక్ పోలింగ్ కార్యక్రమం**
- **ఓటు హక్కు విలువను ప్రత్యక్షంగా నేర్చుకున్న విద్యార్థినులు**

**మహబూబాబాద్, విశాల భారతి):**

భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని, ఆ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే శక్తి ప్రతి ఓటులోనే ఉందని ప్రభుత్వ గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాల, ముత్యాలమ్మగూడెం ప్రధానోపాధ్యాయురాలు డి. కోటేశ్వరి అన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే ఎన్నికల విధానం, ఓటు హక్కు విలువ, రాజ్యాంగబద్ధమైన బాధ్యతలపై స్పష్టమైన అవగాహన పెంపొందించుకోవాలని ఆమె సూచించారు. పాఠశాలలో నిర్వహించిన మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, "నేటి విద్యార్థులే రేపటి బాధ్యతాయుతమైన పౌరులు. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది కేవలం హక్కు మాత్రమే కాదు, దేశ భవిష్యత్తును నిర్ణయించే పవిత్రమైన బాధ్యత కూడా. అందుకే విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియను ప్రత్యక్షంగా చూపించి అవగాహన కల్పిస్తున్నాం" అని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నిజమైన పోలింగ్ కేంద్రాన్ని తలపించేలా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ అధికారి, పోలింగ్ సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లు, ఓటర్లు



వంటి పాత్రలను విద్యార్థినులే నిర్వహిస్తూ ఎన్నికల ప్రక్రియను యథాతథంగా ప్రదర్శించారు. ఓటరు గుర్తింపు, ఓటు నమోదు, బ్యాలెట్ లేదా ఈవీఎం ద్వారా ఓటు వినియోగం, ఓటు గోప్యత వంటి అంశాలను ప్రత్యక్షంగా అనుభవించి విద్యార్థినులు ఎన్నికల నిర్వహణపై సమగ్ర అవగాహన పొందారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు సమాన విలువ కలిగి ఉంటుందని, బాధ్యతాయుతంగా ఓటు వినియోగించినప్పుడే సమర్థవంతమైన నాయకత్వం ఏర్పడుతుందని ఉపాధ్యాయులు విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమం విద్యార్థినుల్లో రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి, ఎన్నికల పట్ల బాధ్యతాభావాన్ని పెంపొందించేలా సాగింది. ప్రధానోపాధ్యాయురాలు డి. కోటేశ్వరి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు సమన్వయంతో పాల్గొన్నారు. ఇన్‌చార్జి హెచ్ఎం యాక లక్ష్మి, డిప్యూటీ వార్డెన్ మొగిలయ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించి విజయవంతం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా మాక్ పోలింగ్‌లో పాల్గొని ఎన్నికల విధానాన్ని ప్రత్యక్షంగా నేర్చుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ వినూత్న కార్యక్రమం పాఠశాలలో విశేష ఆదరణ పొందింది.

## ఆహార పదార్థాల్లో కల్తీని అరికట్టాలి



- **ప్రజల్లో విస్తృత అవగాహన అవసరం**
- **హెచ్ ఫాస్ట్ సీఐ రంజిత్ కుమార్ గౌడ్‌ను కలిసి కోరిన నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ బృందం**

**ముషీరాబాద్ విశాల భారతి:**

ఆహార పదార్థాల్లో పెరుగుతున్న కల్తీని అరికట్టేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం అత్యంత అవసరమని హెచ్ఫాస్ట్ సీఐ రంజిత్ కుమార్ గౌడ్‌ను నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ బృందం కలిసి కోరింది. జాతీయ చైర్మన్ డా. సాయి రమేష్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ సోమ రామ్మోహన్, సౌత్ ఇంచార్జి రాధాకృష్ణ నేతృత్వంలోని ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని హెచ్ఫాస్ట్ సీఐ రంజిత్ కుమార్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ అడల్టేషన్, ఆహార భద్రత, వినియోగదారుల హక్కులపై గ్రామాలు పట్టణాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించే అంశంపై చర్చించారు. అనంతరం సీఐ రంజిత్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కల్తీ ఆహార పదార్థాల వల్ల ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి జిల్లా, ప్రతి గ్రామంలో కల్తీ ఆహారాన్ని గుర్తించే పద్ధతులు, వినియోగదారుల చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ చేపట్టే ప్రజా చైతన్య కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. జాతీయ చైర్మన్ డా. సాయి రమేష్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ సోమ రామ్మోహన్, సౌత్ ఇన్చార్జి రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణే తమ సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. ఫుడ్ అడల్టేషన్ నిర్మూలనతో పాటు సురక్షిత ఆహార వినియోగంపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అవగాహన సదస్సులు, శిక్షణా కార్యక్రమాలు, విద్యార్థులకు ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. హైదరాబాద్ నగరంలోని కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, గృహ తయారీ ఆహార ఉత్పత్తుల్లో నాసిరకం, నాణ్యతలేని పదార్థాలు వినియోగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పై సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరికి తెలిసే విధంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి స్కూల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో. సౌత్ ఇండియా చైర్మన్ డా. నరేష్ ఉన్నారు.

## శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

- **కూకట్‌పల్లిలో 125వ జయంతి వేడుకలు**



శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

**కూకట్‌పల్లి విశాల భారతి;** డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకలు కూకట్‌పల్లిలో సోమవారం ఘనంగా జరిగాయి. బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ శ్యామాప్రసాద్ ముఖర్జీ గొప్ప దేశభక్తుడు, విద్యావేత్త అని కొనియాడారు. 'ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, ఇద్దరు ప్రధానులు ఉండరాదు' అని దేశ సమగ్రత కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని గుర్తుచేశారు. ఆయన ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్ గౌడ్, అనంత నాగరాజు, నర్సింగ్, గోపాల్ రావు, దుర్గాప్రసాద్ రావు, శంకర్ రెడ్డి, సాయి, రమణారెడ్డి, మంజునాథ్, శేఖర్ రావు, రాఘవేందర్, దారా సాయి, కార్యకర్తలు, స్థానికులు పాల్గొని నివాళులర్పించారు.

## రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**రాజేంద్రనగర్, విశాలభారతి :** హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండిఏ) ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ మండలంలో సిసి (సీసీ) మరియు బిటి (బీటీ) రోడ్ల నిర్మాణ పనులకు ఈరోజు ఘనంగా శంకుస్థాపన జరిగింది. సుమారు రూ. 7.50 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నారు. ఈ నిర్మాణ పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేసి, అభివృద్ధి పనులపై తన కట్టుబాటును వ్యక్తం చేశారు. కాచారం, చౌదర్ గూడా మరియు పాల్మకూల్ గ్రామాలలో చేపట్టనున్న సిసి మరియు బీటీ రోడ్ల పనులను ఆయన ప్రారంభించారు. ఈ రోడ్ల నిర్మాణం పూర్తయిన తరువాత ప్రాంతీయ ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడి, గ్రామాల అభివృద్ధికి దోహదం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. అలాగే, ప్రభుత్వం ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, హెచ్ఎండిఏ అధికారులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఎన్టీఆర్ వారియర్స్ సీజన్ 5 క్రికెట్ పోటీలు

- **విజేతగా నిలిచిన ఫైర్ అండ్ బ్లడ్ క్రికెట్ టీం**



**ముషీరాబాద్, విశాల భారతి:** ఇందిరాపార్ ఎన్టీఆర్ స్టేడియం వేదికగా మార్చి 29 నుండి జూలై 5 వరకు ఎన్టీఆర్ వారియర్స్ సీజన్ 5 క్రికెట్ టోర్నమెంట్ పోటీలను నిర్వహించారు. సుమన్, నర్సి నేతృత్వంలో 20 ఓవర్ల లీగ్ టోర్నమెంట్లో 20 జట్లు పాల్గొన్నాయి. టోర్నమెంట్ మొత్తం అత్యుత్తమ ప్రతిభ, జట్టు సమన్వయం, క్రీడా స్ఫూర్తి, పోటీ తత్వాన్ని ప్రదర్శించగా గ్రాండ్ ఫైనల్ కి వచ్చేసరికి వైల్డ్ వింగ్స్ జట్టుపై... ఫైర్ బ్లడ్ జట్టు 92 పరుగుల తేడాతో సీజన్ 5 లో విజయం సాధించింది. ఉత్తమ బ్యాట్స్మెన్ గా శశి, ఉత్తమ బౌలర్ గా శేఖర్, మోస్ట్ వ్యాలీబుల్ ప్లేయర్ గా సుమన్ టోర్నమెంట్ అవార్డులు అందుకున్నారు. అనంతరం నిర్వాహకులు సుమన్, నర్సి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో క్రీడా స్ఫూర్తి ఉండాలనే ఉద్దేశంతో ఎన్టీఆర్ వారియర్స్ పేరిట పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. టోర్నమెంట్ విజయవంతంగా ముందుకు సాగడానికి సహకారం అందిస్తున్న వికాస్ వాల్మీకి, కమల్, నర్సి, గజేంద్ర (హిందూ స్పోర్ట్స్) స్పాన్సర్లకు కృతజ్ఞతలు చెప్పారు. అలాగే టోర్నమెంట్లో పాల్గొన్న అన్ని జట్లు అద్భుతమైన ప్రదర్శన అంకితభావం ప్రతిభ నైపుణ్యం క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాయని కొనియాడారు. ఎన్టీఆర్ వారియర్స్ సీజన్ 6 ను మరింత భారీ స్థాయిలో నిర్వహిస్తామని ఎప్పట్లాగానే ప్రతి ఒక్కరు తమకు సపోర్ట్ గా నిలవాలని కోరారు.

# డీఎస్పీ భీమ్ రెడ్డి అరెస్ట్





- రూ. 300 కోట్ల అక్రమాస్తుల కేసులో ఏసీబీ అరెస్ట్ చేసింది
- నాంపల్లి ఏసీబీ కోర్టులో ఆయనను హాజరుపరుస్తున్నారు
- 17 ప్రాంతాల్లో సోదాలు చేసి భారీ ఆస్తులను గుర్తించారు
- అరెస్ట్ సమయంలో అనారోగ్యంతో కొంత జాప్యం జరిగింది
- మనీ లాండరింగ్ కోణంపై ఈడీ ప్రత్యేక దృష్టి పెట్టింది
- కానిస్టేబుల్ నుంచి డీఎస్పీగా ఎదిగిన ఆయనపై దర్యాప్తు సాగుతోంది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలో అక్రమాస్తుల కలకలం రేగింది. డీఎస్పీ భీమ్ రెడ్డి అవినీతి పర్వం బయటపడటంతో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. భారీ స్థాయిలో అక్రమ ఆస్తులను కూడగట్టినట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు ఆయన్ను అరెస్ట్ చేశారు. నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈయన నివాసంతో సహా మొత్తం పదహారు ప్రాంతాల్లో ఏసీబీ బృందాలు మూకుమ్మడి సోదాలు నిర్వహించాయి. ఈ సోదాల్లో సుమారు మూడు వందల కోట్ల రూపాయల మేర అక్రమాస్తులు బయటపడటం సంచలనం సృష్టించింది. ఒక పోలీస్ అధికారి ఇంత భారీ మొత్తంలో ఆస్తులను ఎలా పోగు చేశారన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఉన్నత పదవిలో ఉండి అవినీతికి పాల్పడటంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ వర్గాల్లో ఈ అరెస్టు తీవ్ర కలకలం రేపింది. నిజాయితీగా పని చేయాల్సిన అధికారులే ఇలాంటి పనులకు ఒడిగట్టడం ఆందోళన కలిగిస్తోంది. భీమ్ రెడ్డిని అరెస్ట్ చేసే క్రమంలో ఊహించని పరిణామాలు చోటుచేసుకున్నాయి. అదుపులోకి తీసుకుంటున్న సమయంలో ఆయన తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. హుటాహుటిన ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన అనంతరం తిరిగి ఇంటికి పంపడం, విచారణకు రావాలని నోటీసులు ఇవ్వడం అప్పట్లో తీవ్ర చర్చకు దారితీసింది. పద్ధతి ప్రకారం అదుపులోకి తీసుకోకుండా ఎందుకు జాప్యం చేశారంటూ ప్రశ్నలు తలెత్తాయి. ఉన్నత స్థాయి ఒత్తిళ్లు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఏసీబీ స్పష్టం చేసింది. ఎట్టకేలకు ఆయన ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని అరెస్టు ప్రక్రియను పూర్తి చేశారు. సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందనే ఉద్దేశంతోనే ఆయనను కోర్టుకు తరలిస్తున్నారు. ఈ వ్యవహారం మొత్తం పారదర్శకంగా జరగాలని కోరుకుంటున్న సాధారణ ప్రజలు భారీ అవినీతిపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించిన భీమ్ రెడ్డి క్రమంగా ఎదుగుతూ డీఎస్పీ స్థాయికి చేరుకున్నారు. సర్వీస్ పరీక్ష రాసి ఎస్సైగా పదోన్నతి పొందారు. ఆ తర్వాత వివిధ దశల్లో పదోన్నతులు పొందుతూ ప్రస్తుతం డీజీపీ కార్యాలయంలో కంప్యూటర్ సర్వీసెస్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు. సాధారణ స్థాయి నుంచి వచ్చిన వ్యక్తి ఇంత తక్కువ కాలంలో మూడు వందల కోట్ల రూపాయల ఆస్తులు ఎలా సంపాదించారన్నది ఇప్పుడు ఏసీబీ అధికారులకు ప్రధాన సవాల్‌గా మారింది. జీతభత్యాల కంటే ఆస్తుల విలువ విపరీతంగా ఉండటంతో అక్రమ మార్గంలోనే ఇదంతా జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించారు. ఎక్కడి నుంచి డబ్బు వచ్చిందనే విషయమై కూపీ లాగుతున్నారు. ఆదాయపు పన్ను శాఖ కూడా ఈ లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించింది. అక్రమ ఆస్తుల వెనుక ఉన్న అసలు బాగోతాన్ని బయటపెట్టేందుకు ఏసీబీ కసరత్తును వేగవంతం చేసింది. ఈ భారీ ఆస్తుల వ్యవహారంలో మనీ లాండరింగ్ కోణం దాగి ఉందని ఈడీ అధికారులు అనుమానిస్తున్నారు. అక్రమంగా వచ్చిన డబ్బును పలు వ్యాపారాల్లో పెట్టుబడులుగా పెట్టారని ప్రాథమిక సమాచారం అందుతోంది. కేసు వివరాలను ఈడీ అధికారులు ఏసీబీ నుండి తెప్పించుకుని పరిశీలిస్తున్నారు. విదేశీ పెట్టుబడులు ఉన్నాయా లేదా అనే కోణంలో కూడా ఆరా తీస్తున్నారు. భారీ స్థాయిలో నగదు లావాదేవీలు జరగడంతో ఫెమా నిబంధనల ఉల్లంఘన జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఈడీ ఎంట్రీతో కేసు తీవ్రత పెరిగింది. భీమ్ రెడ్డికి చెందిన బినామీల వివరాలను సేకరించే పనిలో అధికారులు బిజీగా ఉన్నారు. కష్టపడి సంపాదించని ఆస్తులు కాబట్టి వాటిని జప్తు చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దోషులు ఎవరైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఏసీబీ కరాఖండిగా చెబుతోంది. ఏసీబీ సోదాల్లో బయటపడ్డ ఆస్తుల చిట్టా చూసి అధికారులు కంగుతిన్నారు. హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాల్లో ఖరీదైన ప్లాట్లు, విల్లాలు, ఫామ్ హౌస్‌లు ఉన్నట్లు గుర్తించారు. అలాగే బ్యాంక్ ఖాతాల్లో భారీగా నగదు నిల్వలు, బంగారు ఆభరణాలు, విలువైన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ స్థాయి అధికారిక జీతంతో ఇన్ని ఆస్తులు సంపాదించడం అసాధ్యమని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఈ ఆస్తులన్నీ మార్కెట్ విలువను లెక్కిస్తే మూడు వందల కోట్లకు పైగా ఉంటుందని ఏసీబీ అంచనా. ఇదంతా ప్రజాధనం దోచుకోవడం వల్లే సాధ్యమైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అవినీతిని అరికట్టాల్సిన అధికారులే ఇలాంటి పనులకు పాల్పడటం సిగ్గుచేటని వారు మండిపడుతున్నారు. ప్రభుత్వ శాఖల్లోని అవినీతిని నిర్మూలించే దిశగా ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ కేసు విచారణ ముగిసేసరికి మరిన్ని సంచలన విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో పోలీస్ శాఖలో ఆందోళన నెలకొంది. అవినీతి అధికారుల భరతం పట్టేందుకు ఏసీబీ చేస్తున్న ప్రయత్నాలను సర్వత్రా అభినందిస్తున్నారు. ప్రజలకు చట్టంపై నమ్మకం కలిగించేలా విచారణ జరగాలని కోరుతున్నారు. చిన్న చిన్న అవినీతికే వెనకాడని అధికారులు, భారీ స్థాయిలో కోట్ల రూపాయలు కూడగట్టడం వెనుక ఎవరున్నారనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఉన్నతాధికారుల అండదండలు లేకుండా ఇంత పెద్ద ఎత్తున అక్రమాలు సాధ్యం కావని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అరెస్టు జరిగిన నేపథ్యంలో కేసును ప్రభావితం చేసే ప్రయత్నాలు జరగకుండా ఏసీబీ అప్రమత్తంగా ఉంది. నాంపల్లి కోర్టులో వాదనలు ఆసక్తికరంగా సాగనున్నాయి. దోషులు ఎవరైనా చట్టం ముందు సమానమేనని ఈ కేసు రుజువు చేయాలి. న్యాయవ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని ఈ తీర్పు ద్వారా నిలబెట్టాలని ఆకాంక్షిస్తున్నారు. పోలీస్ అధికారి భీమ్ రెడ్డి అరెస్టు అవినీతిపై సమరానికి ఒక నిదర్శనం. ఇలాంటి వారు సమాజానికి ప్రమాదకరమని అర్థమవుతోంది. మూడు వందల కోట్ల ఆస్తుల వ్యవహారం ఇప్పుడు అందరినీ విస్తుపోయేలా చేస్తోంది. అక్రమ ఆస్తులను పూర్తిగా స్వాధీనం చేసుకుని ఆయన్ను కఠినంగా శిక్షించాలని బాధితులు కోరుతున్నారు. ఏసీబీ, ఈడీ సంయుక్తంగా జరుపుతున్న విచారణలో మరిన్ని నిజాలు వెలుగులోకి వస్తాయని ఆశిద్దాం. అవినీతిని పూర్తిగా నిర్మూలించే వరకు ఈ పోరాటం ఆగకూడదు. అక్రమార్కుల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తేనే బాధ్యత గల అధికారం ఉంటుందని ప్రజలు నమ్ముతున్నారు. ఈ ఘటన ద్వారా మిగిలిన అవినీతి అధికారులు గుణపాఠం నేర్చుకోవాలి. చట్టం కళ్ళు గప్పడం సాధ్యం కాదని అందరికీ అర్థమైంది. పారదర్శక పాలన అందించడమే ధ్యేయంగా ప్రభుత్వ యంత్రాంగం పనిచేయాలి. సమగ్ర విచారణ తర్వాత నిజాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

## మియాపూర్ మంగళవారం సంతకు లైన్ క్లియర్

- సీఎంసీ నుంచి అధికారిక అనుమతి.. రేపటి నుంచే సంత



సీఎంసీ అనుమతి పత్రాన్ని ప్రదర్శిస్తున్న మార్కెట్ కమిటీ ప్రతినిధులు

**సైబరాబాద్ విశాల భారతి;** మియాపూర్ మంగళవారం సంతకు మార్గం సుగమమైంది. సంత నిర్వహణకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) సోమవారం అధికారిక అనుమతి మంజూరు చేసింది. సీఎంసీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ ప్రతినిధులు అనుమతి పత్రాన్ని స్వీకరించారు. వ్యాపారుల జీవనోపాధి కోసం గత నాలుగు వారాలుగా మార్కెట్ కమిటీ చేసిన కృషి ఫలించింది. దీంతో రేపటి నుంచి ప్రతి మంగళవారం సంత ఎలాంటి ఆటంకాలు లేకుండా యథావిధిగా జరగనుంది. అనుమతి మంజూరుకు సహకరించిన పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్, సీఎంసీ కమిషనర్, అధికారులు, ప్రజాప్రతినిధులకు మార్కెట్ కమిటీ ధన్యవాదాలు తెలిపింది. బోయిని మహేశ్ యాదవ్, అడ్వకేట్ కిషోర్ యాదవ్, లక్ష్మణ్, రాధాకృష్ణ యాదవ్, గణేశ్, దేవేందర్, మార్కెట్ కమిటీ సభ్యులు, వ్యాపారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్యాపారుల సంక్షేమానికి తమ కమిటీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని మియాపూర్ వెజిటబుల్ మార్కెట్ యూత్ అసోసియేషన్ స్పష్టం చేసింది.

## కొండాపూర్‌లో అభివృద్ధి పనుల జోరు

- రూ.5.38 కోట్లతో రోడ్లు, స్మశాన వాటిక అభివృద్ధి



శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ తదితరులు

**సైబరాబాద్ విశాల భారతి;** కొండాపూర్ డివిజన్‌లో రూ.5.38 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సోమవారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ శంకుస్థాపన చేశారు. ప్రేమ్ నగర్ బీ బ్లాక్‌లో హిందూ స్మశాన వాటిక అభివృద్ధికి రూ.2 కోట్లు, ఓయూ ప్రొఫెసర్ కాలనీలో సీసీ రోడ్లకు రూ.2.98 కోట్లు, శ్రీరామ్ నగర్ ఏ బ్లాక్‌లో సీసీ రోడ్లకు రూ.40 లక్షలతో పనులు చేపట్టనున్నారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయమన్నారు. నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ మాట్లాడుతూ కొండాపూర్ అభివృద్ధే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## శ్యాం ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



**సికింద్రాబాద్, విశాలభారతి :** అఖండ భారతావని కోసం తన ప్రాణాలు అర్పించిన భారతమాత ముద్దుబిడ్డ జనసం వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని నాయకులు ఘనంగా జరుపుకున్నారు. భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా నిజాంపేట అధ్యక్షుడు పి వెంకటేశ్వర ముదిరాజ్ ఘన నివాళులు అర్పించడం జరిగింది

## బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి



**సికింద్రాబాద్,విశాల భారతి:** భారత మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయ సాధనకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని సికింద్రాబాద్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. సీతాఫలమండి లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ కార్పొరేటర్ హేమ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బి అర్ ఎస్ పార్టీ నాయకులు గడ్డం ప్రసాద్, కరాటే రాజు, ప్రసాద్, లలిత, శ్యామల, పరుశురాం, ఆనంద్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు

## అనధికార ఫ్లెక్సీల తొలగించాలి

- సిబ్బందితో తనిఖీలు చేసిన ఉప కమిషనర్ చాముండేశ్వరి




**సైబరాబాద్ విశాల భారతి;** పారిశుద్ధ్య తనిఖీల్లో భాగంగా భాగ్యనగర్ ప్రధాన రహదారిపై ఉన్న పీఎన్ఆర్ ఎంపైర్ మాల్ వద్ద ఉప కమిషనర్ చాముండేశ్వరి సిబ్బందితో కలిసి సోమవారం తనిఖీలు నిర్వహించారు. డీసీ ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 పరిధిలో అనధికారికంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలని మాల్ యాజమాన్యానికి సూచించారు. మాల్ పరిసరాల్లో అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పట్టణ ప్రణాళిక నిబంధనలకు విరుద్ధంగా ఉందని చాముండేశ్వరి పేర్కొన్నారు. నగర సుందరీకరణకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తనిఖీల్లో మాల్ సెక్యూరిటీ సిబ్బందికి ఆమె సూచనలు చేశారు. నగరంలో అనధికార ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లపై కఠినంగా వ్యవహరిస్తామని, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధిస్తామని చాముండేశ్వరి హెచ్చరించారు. ఉదయం తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

## రాష్ట్ర అధ్యక్షులుని కలిసిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్



**పాల్వంచ:విశాలభారతి:** మానకొండూరు శాసనసభ్యులు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణను ఆదివారం అయన నివాసంలో మర్యాదపూర్వకంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గద్దల రమేష్ కలిశారు. ఈసందర్భంగా గద్దల రమేష్ మాట్లాడుతూ ఈనెల 18వ తారీకున కొత్తగూడెం పట్టణంలో జరగనున్నటువంటి జిల్లా ఎస్సీ విభాగం కమిటీల బాధ్యతల స్వీకరణ మహోత్సవానికి రావాలని ఆహ్వానించడం జరిగింది ఈ సందర్భంగా చైర్మన్ కవంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్సి విభాగం పనితిరునుపై గద్దల రమేష్‌ను ప్రశంసించారు రాబోయే కాలంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న దళితులను ఏకం చేసి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను దళిత ప్రజలకు అందేలా పార్టీ బలోపేతానికి కృషి చేయాలనీ అన్నారు

## ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా తనిఖీ

- బీఎల్ఓలకు దిశానిర్దేశం చేసిన ఉప కమిషనర్ చాముండేశ్వరి

**సైబరాబాద్ విశాల భారతి;** ఎల్లమ్మబండ తారకరామారావు నగర్ కాలనీలోని పీఎస్ 505, 507 పరిధిలో ఓటరు జాబితా సవరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 ఉప కమిషనర్ చాముండేశ్వరి, బీఎల్ఓ సూపర్‌వైజర్‌తో కలిసి సోమవారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఇంటింటికీ వెళ్లి ఎస్ఐఆర్ ఫారాల పంపిణీ, ఈఎఫ్ ఫారమ్‌ల డిజిటైజేషన్‌ను పరిశీలించిన కమిషనర్, పనులు వేగవంతం చేయాలని బీఎల్ఓలను ఆదేశించారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించాలని, ఒక్క ఓటరు కూడా మిస్ కాకూడదని సూచించారు.



తారకరామారావు నగర్‌లో ఓటర్లతో మాట్లాడుతున్న కమిషనర్ చాముండేశ్వరి

## జర్నలిస్టు పిల్లలకు ఫీజు రాయితీ సర్కులర్ జారీ చేయాలి

**టీయూడబ్ల్యూజే నియోజవర్గ ప్రధాన కార్యదర్శి ముడుపు శ్యాంసుందర్ రెడ్డి**



**మునుగోడు విశాలభారతి:** జర్నలిస్టు కుటుంబ సభ్యుల పిల్లలకు ఫీజు రాయితీ సర్కులర్ ను తక్షణమే జారీ చేయాలనీ టీయూడబ్ల్యూజే (ఐజేయు) నియోజవర్గ ప్రధాన కార్యదర్శి ముడుపు శ్యాంసుందర్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. టీయూడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా కమిటీ ఆదేశానుసారం నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టు కుటుంబ సభ్యుల పిల్లలకు ఫీజు రాయితీ సర్కులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మునుగోడు మండల కేంద్రంలోనీ విద్య శాఖ కార్యాలయం వద్ద జర్నలిస్టులు నల్ల రిబ్బన్ లతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన టీయూడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు కుంభం ఇంద్రసేనారెడ్డితో కలిసి మండల విద్యాధికారి తలమల్ల మల్లేశంకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ టీయూడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా కమిటీ గత నెల 5న నల్లగొండ డిఇఓ, కలెక్టర్ కి జర్నలిస్టు కుటుంబ సభ్యుల పిల్లలకు పాఠశాల విద్యలో ఫీజు రాయితీ కోసం వినతి పత్రాలు సమర్పించడం జరిగిందన్నారు. స్కూల్ ప్రారంభం అయి నెల రోజులు కావస్తున్నప్పటికిని విద్యాశాఖ సర్కులర్ జారీ చేయకుండా నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదన్నారు. ఇతర జిల్లాలలో ఇప్పటికే ఫీజు రాయితీ సర్కులర్ జారీ చేసినందున తక్షణమే నల్గొండ జిల్లాలో కూడా సర్కులర్ జారీ చేసి పేద కుటుంబాల జర్నలిస్టుల పిల్లలు విద్యకు దూరం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే(ఐజేయు) నియోజవర్గ ఉపాధ్యక్షుడు జాజుల స్వామి, సహాయ కార్యదర్శి దొమ్మాటి కృష్ణ, జర్నలిస్టులు మార్నేని ప్రభాకర్, నెల్లికంటి శంకర్, బేరీ లింగస్వామి, పెరుమాళ్ళ ప్రమోద్ కుమార్, దుబ్బ విజయ భాస్కర్, జీడిమడ్ల నరేష్, దుబ్బ అనిల్ , విజయ్ కుమార్ లు పాల్గొన్నారు.

## ఘనంగా డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు



**ఆలేరు, విశాల భారతి:** భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, గొప్ప జాతీయ వాది డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఆలేరు పట్టణ బీజేపీ కార్యాలయంలో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎలగల వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, దేశ సమైక్యత, అఖండ భారత సాధన కోసం డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశభక్తి, జాతీయ సమగ్రతకు ఆయన చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. 5వ వార్డు కౌన్సిలర్ పాశికంటి సంపత్, జిల్లా కార్యదర్శి కమిటీ కారీకృష్ణ, కౌన్సిల్ సభ్యుడు వడ్డమాని నరేందర్, సీనియర్ నాయకులు చిలుగూరి నర్సిరెడ్డి, సముద్రాల శ్రీనివాస్, బందేల విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

## కొరకల్ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలి



**వాజేడు, జూలై6 విశాల భారతి**

వాజేడు మండల పరిధిలోని గ్రామాలు ఎదుర్కొంటున్న పలు దీర్ఘకాలిక ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఈరోజు ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే (ప్రజావాణి) కార్యక్రమంలో ప్రజా పోరాట సమితి ఆధ్వర్యంలో గౌరవనీయులైన ములుగు జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజా పోరాట సమితి అధ్యక్షుడు ముత్తేబోయిన మహేందర్ మాట్లాడుతూ వాజేడు మండలంలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని ముఖ్యమైన సమస్యల వల్ల స్థానిక ప్రజలు, ముఖ్యంగా గిరిజనులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా ఐదు డిమాండ్లను ప్రస్తావించినట్లు ఆయన తెలిపారు * చీకుపల్లి ఇసుక వాగుపై ప్రతిపాదిత బ్రిడ్జి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి. గోదావరి వరదలు వచ్చిన ప్రతిసారీ ఈ ప్రాంతం బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోతోంది. బ్రిడ్జి లేకపోవడం వల్ల వరద సమయాల్లో స్థానిక ప్రజలకు వైద్యం, విద్య, నిత్యావసర వస్తువుల సరఫరా నిలిచిపోయి ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బతకాల్సి వస్తోంది. అలాగే అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడేందుకు పేరూరు ప్రాంతంలో 108 అంబులెన్స్ సౌకర్యంతో పూర్తి స్థాయి వైద్య సదుపాయాలను వెంటనే కల్పించాలి. వాజేడు మండలంలోని ఆశ్రమ పాఠశాలల భవనాలు, తరగతి గదులు నిర్లక్ష్యానికి గురై చాలా అధ్వాన్నంగా తయారయ్యాయి. మండలంలోని అయ్యవారిపేట MPPS పాఠశాలలకు చెందిన విలువైన భూములు అక్రమార్కుల చేతుల్లో కబ్జాలకు గురవుతున్నాయి. కాబట్టి ఆయా పాఠశాలల చుట్టూ, అలాగే స్థానిక హైస్కూల్ చుట్టూ తక్షణమే రక్షణ గోడలు (Compound Walls) నిర్మించి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలి. పాఠశాలల్లో సురక్షితమైన తాగునీటి వసతిని వెంటనే కల్పించాలి. కొరకల్ గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు ప్రస్తుతం కొరకల్ గ్రామం చింతూరు నుండి సుమారు 6 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇంత దూరంలో ఉండటం వల్ల గ్రామ ప్రజలు పరిపాలనా పరమైన పనులకైనా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిపాలనా సౌలభ్యం మరియు గ్రామాభివృద్ధిని వేగవంతం చేయడం కొరకు కొరకల్‌ను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజల తరపున డిమాండ్ చేస్తు. వాజేడు మండల ప్రజల తరపున ముత్తేబోయిన మహేందర్ వేడుకున్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ప్రజా పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రజల పక్షాన పోరాటాలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గార రవికుమార్, కుమ్మరి శ్రీనాథ్, గగ్గూరి నాగేంద్రబాబు ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా బాబు జగ్జీవన్ రావు 40 వ వర్ధంతి

- మచ్చలేని మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్
- పార్లమెంటేరియన్ చరిత్రలో స్థిరస్థాయిగా నిలిచిన నాయకుడు
- జనం కోసమే సంపూర్ణంగా జీవితం అంకితం చేసిన యోధుడు
- పీడిత వర్గాల పెన్నిధి అనగారిన కులాల ఆశాజ్యోతి
- తెలంగాణ మాదిగ దండోరా జిల్లా ప్రధాన కార్యదర్శి గురజాల వెంకటేశ్వర్లు



**భద్రాచలం: విశాల భారతి;**

భద్రాచలం పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ మాదిగ దండోరా ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సభ నిర్వహకులు తెలంగాణ మాదిగ దండోరా జిల్లా ప్రధాన కార్యదర్శి గురజాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ. బీహార్ రాష్ట్రంలో ఆరా పట్టణానికి దగ్గరగా చాన్ద్వార్ గ్రామంలో ఏప్రిల్ 5 1908 జన్మించి చర్మకార వృత్తి చేసుకుంటూ ఉన్నత చదువులు చదివి పెద్ద పదవులు పొందిన మాదిగల మహానేత బాబు జగజీవన్ రామ్ గర్వించదగ్గ వ్యక్తిఅని ఆయన కొనియాడారు. ఆయనను బేబీ మినిస్టర్ అని పిలిచే వారిని ఆయన గుర్తు చేశారు. రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నిక 1947లో ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ కార్మిక మహాసభకు అధ్యక్షులుగా బాబు జగ్జీవన్ రామ్ ఎన్నికయ్యారని ఆయన తెలిపారు. 29 ఏళ్ల పాటు కేంద్ర మంత్రిగా ఉప ప్రధానిగా సెంట్రల్ పార్లమెంట్ బోర్డ్ సభ్యులుగా ఎసిసి అధ్యక్షునిగా అనేక బాధ్యతలు నిర్వహించారని ఆయన పేర్కొన్నారు .ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ లకు ప్రభుత్వ ఉద్యోగాలు, నాయకత్వంలో ప్రాధాన్యత అణగారిన వర్గాలకు కల్పించాలని అవిశ్రాంతంగా కృషి చేశారు. బాబు జగ్జీవన్ రామ్ ఉప ప్రధానిగా ఎదిగిన ఘనత వారికి దక్కుతుందని తెలియజేశారు. కుల వివక్షత అంటరానితనం అస్పృశ్యత వంటి అస్మానతలు తొలగిపోవాలని కుల నిర్మూలన జరగాలని ఆయన ఎనలేని కృషి చేశారు. మాదిగ జాతి నుండి తిరుగులేని నాయకుడిగా ఎదురులేని ప్రజాప్రతినిధిగా ఎదిగారని, ఓటమి లేని మహనీయుడని మచ్చలేని మహానేతని ఆయన్ని కొనియాడారు. ఆయనను నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలని రాజ్యాధికారం సాధించాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మహా జన సమితి అధ్యక్షులు గడ్డం సుధాకర్ రావు. యువజన సంక్షేమ సమితి అధ్యక్షులు చింత నాగ ముత్యం. ఏజెన్సీ ప్రజా సంక్షేమ సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి కనకం శ్రీమన్నారాయణ.. అలవాల రాజారవ్వ భద్రమ్మ ,ఇసంపల్లి ముత్యం ,కొప్పుల తిరుపతి ,వలదాస్ వెంకట ,నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపట్ల జరభద్రం

- అధికారుల అప్రమత్తతతోనే వ్యాధుల నివారణ
- పరిసరాల పరిశుభ్రత పై నిర్లక్ష్యం వీడాలి
- వ్యక్తిగత పరిశుభ్రత పై శ్రద్ధ తీసుకోవాలి
- ఆదమరిస్తే అనర్థాలే

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాల భారతి :**



నిన్న మొన్నటి వరకు తీవ్రమైన ఎండలకుతో అల్లాడిన జనానికి వర్షాల రాకతో కాస్త ఉపశమనం కలిగింది. వాతావరణం కూడా చల్లబడింది. ప్రతిరోజు ఏదో ఒక చోట చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. కాలం చల్లబడిందని సంతోషిస్తున్న తరుణంలోనే మరో సమస్య కూడా ఉత్పన్నమయ్యేందుకు సిద్ధమవుతోంది. జులై, ఆగస్టు మాసాలలో వర్షాలు సమృద్ధిగా పడితే గ్రామాలలో కొన్ని కొన్ని ప్రాంతాలలో మురుగునీరు, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత లోపం కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం లేకపోలేదు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామీణ ప్రాంతాలు అయితే గ్రామపంచాయతీలు, పట్టణ ప్రాంతాలు అయితే మున్సిపాలిటీ, పురపాలక సంస్థలు పారిశుద్ధ్య పనులను చేసి గ్రామాలను అపరిశుభ్రంగా ఉండకుండా తక్షణ చర్యలు చేపట్టి ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి.

**సీజనల్ వ్యాధులు ప్రభలెందుకు కొన్ని ముఖ్య కారణాలు :**

1. దోమలు వృద్ధి చెందడం ద్వారా డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా తో పాటు మరికొన్ని ఇతర దోమలు కుట్టడం వల్ల శరీరంపై దద్దుర్లు తేలిక కపాటి జ్వరాలు వస్తాయి. ఈ వ్యాధులు లు ప్రబలకుండా సీజన్ కు తగ్గట్టుగా నివారణ చర్యల్లో నిమగ్నమైతే మంచిది.

**దోమల నివారణకు ముఖ్యమైన చర్యలు ఇవి :**

దోమల ద్వారా సంక్రమించే వ్యాధులను నివారణకు ప్రధానంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని నివాసాల చుట్టూ పరిసర ప్రాంతాలలో వర్షం ద్వారా నిల్వ అయ్యే మురికి నీరు ఉండకుండా చూసుకోవాలి. ఇండ్లలోని కూలర్లు, టైర్లు, తాగి పడేసిన కొబ్బరి బోండాల తో పాటు ఎక్కువ రోజులు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. దోమతెరలు, మస్కిటో కాయిల్స్, శరీరం నిండా ఉండేలా దుస్తులు ధరించడం ద్వారా దోమల నివారణను చేపట్టి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

2. కలరా, టైఫాయిడ్ వ్యాధులు కలుషిత ఆహారం, నీరు తీసుకోవడం ద్వారా ఈ వ్యాధులు సంక్రమిస్తాయి. వీటిని నివారించేందుకు మరిగించి చల్లార్చిన నీరును తీసుకోవడం, రోడ్ల పక్కన బహిరంగ ప్రదేశాలలో అమ్మే తినుబండారాలను తినడం మానేయడం ద్వారా నివారించవచ్చు. అదేవిధంగా వర్షాకాలం సీజన్లో వేడివేడి ఆహారపదార్థాలను తీసుకోవడం ద్వారా వ్యాధులు ప్రబలకుండా చూసుకోవచ్చు అని వైద్యులు చెబుతున్నారు. రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి విధిగా పండ్లు, ఆకుకూరల తోపాటు నారింజ, నిమ్మ వంటి రోజువారి ఆహారంలో తీసుకుంటే మంచిది.

**పంచాయితీ, వైద్య ఆరోగ్య శాఖ చేపట్టాల్సిన నివారణ చర్యలు :**

గ్రామాలు, పట్టణాలలో పంచాయతీ, పురపాలక అధికారులు పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా, దోమల నివారణ పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అలాగే రక్షిత మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ బ్లీచింగ్, కోరినేషన్ చేయించాలి. తాగునీటి కుళాయిలు, చేతి పంపుల వద్ద నీరు నిలవకుండా కాలువలు ఏర్పాటు చేయాలి. అదేవిధంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు ఏఎన్ఎంలతో కలిసి జ్వరాలు ఇతర లక్షణాలు ఉన్న వారిని గుర్తించడానికి ఇంటింటి సర్వేలు నిర్వహించాలి. వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత, ఈ సీజన్లో తీసుకోవలసిన వ్యాధులు ప్రబలకుండా చేపట్టే నివారణ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించి వ్యక్తిగత పరిశుభ్రతను పాటించేలా విధిగా ప్రజలలో చైతన్యం కల్పించాలి. గ్రామపంచాయతీ అధికారులు ఆయా పంచాయతీల సిబ్బందితో పారిశుధ్య పనులు చేపిస్తూ విధిగా గ్రామాలలో సంచరించేలా చర్యలు చేపట్టాలి. విధిగా బ్లీచింగ్ చల్లించడం, ట్రాక్టర్ల ద్వారా తడి చెత్త పొడి చెత్తను డంపింగ్ యార్డ్ కు తరలించడం చేయాలి. అదేవిధంగా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు వైద్య సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తతో వారిని విధి నిర్వహణను చేపట్టేలా చర్యలు తీసుకుంటే వ్యాధులు ప్రజల దరికి చేరమని ఆరోగ్య నిపుణులు చెప్పున్నారు.

## మాజీ ఎంపీ దానం చేసిన ఆలయ భూమి కబ్జా?

**ఇంటి నిర్మాణంతో పాటు పదేళ్లుగా రైతుబంధు పొందుతున్న ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు..!**



**మరిపెడ విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా మరిపెడలో సంచలనం రేపుతున్న భూకబ్జా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మాజీ పార్లమెంట్ సభ్యులు రామసహాయం సురేందర్ రెడ్డి మాకుల శ్రీ వెంకటేశ్వర ఆలయానికి దానం చేసిన రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో సుమారు 8 గుంటల భూమిని ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు అక్రమంగా ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టడంతో పాటు గత పది నుంచి పన్నెండు సంవత్సరాలుగా రైతుబంధు పథకం కింద లబ్ధి పొందుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఈ మేరకు గ్రామానికి చెందిన వేర్మరెడ్డి వెంకట్ రెడ్డి, కుడితి వెంకట్ రెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌కు గ్రీవెన్స్ సెల్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు ప్రకారం, గతంలో ఆలయ మేనేజర్‌గా పనిచేసిన బోగోజు భిక్షమాచారి, ప్రస్తుతం ఆలయ అర్చకునిగా పనిచేస్తున్న నల్ల చక్రవర్తుల లక్ష్మణాచార్యులు ఆలయ భూమిని ఆక్రమించి అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్నారని ఆరోపించారు. అనంతరం ఆ ఇళ్లను తమ భార్యలైన బోగోజు ఉమా, నల్లాన్ గోదాదేవి పేర్లపై స్థానిక పంచాయతీ రికార్డుల్లో నమోదు చేయించుకున్నారని పేర్కొన్నారు.ఇంకా, ఇళ్ల నిర్మాణం జరిగిన స్థలాన్ని వ్యవసాయ భూమిగా చూపిస్తూ గత 12 ఏళ్లుగా రైతుబంధు పథకం ద్వారా ప్రభుత్వ నిధులను పొందుతున్నారని ఫిర్యాదులో ఆరోపించారు.ఆలయ భూమిని కబ్జా చేసి ప్రభుత్వ పథకాల లబ్ధి పొందిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి, రెవెన్యూ రికవరీ చట్టం కింద రైతుబంధు నిధులను తిరిగి వసూలు చేయాలని గ్రామ పెద్దలు జిల్లా కలెక్టర్‌ను కోరారు.ఈ ఘటనపై జిల్లా అధికార యంత్రాంగం ఎలా స్పందిస్తుందనే దానిపై స్థానికంగా తీవ్ర ఆసక్తి నెలకొంది.

## సాంబాయిగూడెంలో ఘోర రోడ్డు ప్రమాదం

**ఇద్దరికి తీవ్ర గాయాలు, మహిళ పరిస్థితి విషమం**



**పినపాక, విశాల భారతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం సాంబాయిగూడెం గ్రామ సమీపంలో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మణుగూరు వైపు నుంచి వస్తున్న ఓ కారు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో బైక్ నడుపుతున్న వ్యక్తికి చేయి విరగడంతో పాటు శరీరంలోని పలు భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడి వెనుక కూర్చున్న సుమారు 50 ఏళ్ల మహిళ తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వ్యక్తి మొబైల్ ఫోన్ ద్వారా అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా, అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించి క్షతగాత్రులను మణుగూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన బైక్ రైడర్ తెలిపిన వివరాల ప్రకారం, తాము రంగాపురం సమీపంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన వారిగా తెలుస్తోంది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## ఘనంగా న్యూ మారుతి నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

**కాలనీ అభివృద్ధే లక్ష్యంగా ఐక్యంగా పనిచేస్తాం – నూతన అధ్యక్షురాలు కె. విజయలక్ష్మి**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** సాహెబ్‌నగర్ డివిజన్ పరిధిలోని న్యూ మారుతి నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. కాలనీ గణేష్ మండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ సభాధ్యక్షుడిగా హాజరై నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా ఎస్కే అహ్మద్ హుస్సేన్, అధ్యక్షురాలిగా కె. విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా యు. నరసింహ, కోశాధికారిగా సి.హెచ్. అనిల్, కార్యవర్గ సభ్యుడిగా జిలాని, సలహాదారులుగా ఎస్. ఎన్. షరీఫ్, సత్యనారాయణ, సంతోష్ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు కె. విజయలక్ష్మి మాట్లాడుతూ.. రాజకీయాలకు, వర్గ విభేదాలకు అతీతంగా కాలనీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి కనీస మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పచ్చదనాన్ని పెంపొందిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని చెప్పారు. గాయత్రి నగర్ ఫేజ్-4 అధ్యక్షుడు మనోజ్ గౌరిశెట్టి మాట్లాడుతూ.. కాలనీలోని సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమ సమన్వయకర్త, బ్లడ్ క్రాస్ సొసైటీ సీఈఓ డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ.. కాలనీ సంక్షేమమే లక్ష్యంగా పార్టీలకు అతీతంగా ఐక్యంగా పనిచేయాలని, ఎన్నికల సమయంలో ప్రలోభాలకు గురికాకుండా సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. గాయత్రి నగర్ ప్రతినిధి నీనా భవాని మాట్లాడుతూ.. శివారు కాలనీల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి కాలనీ, గాయత్రి నగర్ ఫేజ్-1, ఫేజ్-3, శ్రీ వెంకటేశ్వర కాలనీ, పీవీఆర్ కాలనీ ప్రతినిధులు, ప్రముఖులు గూడూరు వెంకటేష్, సోమయాజులు, వెంకటేశ్వరరావు, రాధా విష్ణుమోహన్, రాజు గౌడ్, పి. కృష్ణ, ఉషారాణి, గౌరీశంకర్, దుర్గా మంగపతి, పావని కిరణ్, జి. రాము తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి 10కే రన్‌లో బాటసింగారం పీడీ డాక్టర్ సోలపోగుల స్వాములు ప్రతిభ

**జాతీయస్థాయిలో 4వ స్థానం సాధించి రంగారెడ్డి జిల్లాకు గుర్తింపు – అభినందనల వెల్లువ**




**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ నగరంలో ఈ నెల 5వ తేదీ ఆదివారం ఉదయం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన అమరావతి 10కే రన్ పోటీల్లో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బాటసింగారం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సోలపోగుల స్వాములు విశేష ప్రతిభ కనబరిచారు. దేశం నలుమూలల నుంచి వేలాది మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ ప్రతిష్ఠాత్మక 10 కిలోమీటర్ల పరుగు పందెంలో డాక్టర్ సోలపోగుల స్వాములు అత్యుత్తమ ప్రదర్శనతో 4వ స్థానాన్ని కైవసం చేసుకుని రంగారెడ్డి జిల్లా ప్రతిష్ఠను జాతీయ స్థాయిలో చాటారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారి (ఎంఈవో) ప్రతాప్, బాటసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ సోలపోగుల స్వాములను ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన క్రీడా శిక్షణ అందిస్తూ, మరోవైపు స్వయంగా జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచడం ప్రతి ఉపాధ్యాయుడికి, ప్రతి క్రీడాకారుడికి ఆదర్శమని కొనియాడారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని మరిన్ని విజయాలు సాధించి జిల్లా, రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. డాక్టర్ సోలపోగుల స్వాములు సాధించిన విజయంపై జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. బాటసింగారం గ్రామ సర్పంచ్ గౌరీశంకర్ , ఉపసర్పంచ్, గ్రామ పెద్దలు, గ్రామస్తులు ఆయనను ప్రత్యేకంగా అభినందిస్తూ, భవిష్యత్తులో మరెన్నో ఉన్నత విజయాలు సాధించి రాష్ట్రం, దేశ స్థాయిలో మరింత గుర్తింపు పొందాలని శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ సోలపోగుల స్వాములు సాధించిన ఈ విజయం బాటసింగారం గ్రామంతో పాటు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లాకు గర్వకారణంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## శిల్పకళావేదికలో సీఎం కార్యక్రమ ఏర్పాట్లు ముమ్మరం

**క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఉన్నతాధికారులు**



శిల్పకళావేదిక వద్ద ఏర్పాట్లపై చర్చిస్తున్న కమిషనర్, పోలీసు ఉన్నతాధికారులు

**సైబరాబాద్ విశాల భారతి:** శిల్పకళావేదికలో జరిగే ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను సోమవారం ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, సమాచార, ప్రజాసంబంధాల కమిషనర్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, డీసీపీ కూకట్‌పల్లి, అదనపు కమిషనర్ పారిశుద్ధ్యం, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ బృందం సంయుక్తంగా వేదికను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు.పారిశుద్ధ్యం, పరిశుభ్రత, వేదిక నిర్వహణ, లాజిస్టిక్స్, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. కార్యక్రమం ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ముందుగానే ఏర్పాట్లు పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

**సైబరాబాద్ ప్రజావాణిలో 52 అర్జీల స్వీకరణ**




**సైబరాబాద్ విశాల భారతి:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం కమిషనర్ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పౌరులు తమ సమస్యలు, వినతులు, సూచనలను నేరుగా కమిషనర్‌కు విన్నవించారు. మొత్తం 52 అర్జీలు అందాయి. శాఖల వారీగా చూస్తే.. టౌన్ ప్లానింగ్ విభాగానికి అత్యధికంగా 42 ఫిర్యాదులు రాగా, ఇంజినీరింగ్ విభాగానికి 9, ఎంటమాలజీ (దోమల నియంత్రణ) విభాగానికి 1 ఫిర్యాదు అందింది. శాఖాధిపతుల సమక్షంలో ప్రతి వినతిని కమిషనర్ క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అందిన ప్రతి ఫిర్యాదును ప్రత్యేక గ్రీవెన్స్ ఐడీ, ట్రాకింగ్ లింక్‌తో నమోదు చేస్తున్నామని, దీంతో పౌరులు తమ ఫిర్యాదు పురోగతిని పారదర్శకంగా తెలుసుకునే వీలుందని తెలిపారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుని వెంటనే తనిఖీలు చేపట్టి సకాలంలో పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని స్పష్టం చేశారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్లు, విభాగాధిపతులు, అర్జీదారులు పాల్గొన్నారు.

## రూ.338 కోట్లతో ఇబ్రహీంపట్నం–ఎల్బీనగర్‌కు నాలుగు లైన్ల రహదారుల వరం

**నేడు శంకుస్థాపన.. ప్రాంతీయ అభివృద్ధికి నూతన అధ్యాయం – ప్రజలు, నాయకులు భారీగా హాజరుకావాలి : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** ఇబ్రహీంపట్నం, ఎల్బీనగర్ నియోజకవర్గాల మౌలిక సదుపాయాల అభివృద్ధిలో కీలక ఘట్టంగా రూ.338 కోట్ల వ్యయంతో హ్యామ్ (HAM) విధానంలో చేపట్టనున్న ఆధునిక నాలుగు లైన్ల రహదారుల నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపన జరగనుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. సోమవారం నిర్వహించిన వీడియో సమావేశంలో మల్ రెడ్డి రంగా రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ ప్రతిష్ఠాత్మక రహదారి ప్రాజెక్టుకు ఆమోదం లభించిందని చెప్పారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంగళవారం ఉదయం 10:30 గంటలకు ఈ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఐటీ, పరిశ్రమల శాఖ మరియు జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా తుర్కయాంజాల్, తొర్రూర్, హయత్‌నగర్, కుంట్లూరు, పెద్ద అంబర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్ తదితర ప్రాంతాల్లో సెంట్రల్ లైటింగ్‌తో కూడిన ఆధునిక నాలుగు లైన్ల రహదారులు నిర్మించబడతాయని, ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన, నాణ్యమైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. హయత్‌నగర్-తొర్రూర్-కోహెడ-అనాజ్‌పూర్, అనాజ్‌పూర్-అబ్దుల్లాపూర్‌మెట్-బండరావిర్యాల, హయత్‌నగర్-కుంట్లూరు-పసుమాముల-తారామతిపేట, సాగర్ రోడ్డు-ఇంజాపూర్-తొర్రూర్-బ్రాహ్మణపల్లి-రాగన్నగూడ, సాగర్ రోడ్డు-ఇంజాపూర్-హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్-మంగళపల్లి, ఇబ్రహీంపట్నం-మంచాల్-రంగాపూర్-చీదేడ్-దాత్పల్లి-మాల్ వరకు ఈ రహదారి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ప్రజా ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని, ఈ రహదారి ప్రాజెక్టు ఇబ్రహీంపట్నం, ఎల్బీనగర్ ప్రాంతాల అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు.ఈ శంకుస్థాపన కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, మీడియా ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రతి పోలీస్ స్టేషన్ ప్రజలకు రక్షణ కేంద్రంగా మారాలి



- సరిహద్దు ప్రాంతాల్లో గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా:
- డీజీపీ సీవీ ఆనంద్
- మణుగూరులో నూతన పోలీస్ స్టేషన్ భవనం ప్రారంభం
- శాంతిభద్రతలు మరింత మెరుగు
- ఎమ్మెల్యే పాయం

**మణుగూరు, విశాల భారతి :**

మణుగూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాన్ని సోమవారం తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, మల్టీ జోన్2 ఐజీ చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీవో తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన భవనంలోని రిసెప్షన్, సీసీ కెమెరాల పర్యవేక్షణ గది, విచారణ గదులు, మహిళా డెస్క్ వంటి సౌకర్యాలను డీజీపీ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ ప్రజలకు స్నేహపూర్వక సేవలు అందించడమే పోలీసుల ప్రధాన విధి అని, స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. "ప్రతి పోలీస్ స్టేషన్ ప్రజలకు భరోసా కల్పించే రక్షణ కేంద్రంగా ఉండాలి. ప్రజల నమ్మకమే పోలీసు వ్యవస్థకు శ్రీరామరక్ష" అని ఆయన పేర్కొన్నారు.

**గంజాయిపై 'జీరో టాలరెన్స్'**

ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దులకు మణుగూరు దగ్గరగా ఉన్నందున గంజాయి రవాణా జరిగే ప్రమాదం ఉందని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని డీజీపీ ఆదేశించారు. "రాష్ట్రంలో గంజాయిని పూర్తిగా కట్టడి చేయాలనే లక్ష్యంతో హోమ్‌గార్డ్ స్థాయి నుంచి డీజీపీ స్థాయి వరకు అందరూ సమన్వయంతో పనిచేయాలి. మత్తుపదార్థాల వల్ల యువత బలికాకుండా అవగాహన కల్పించడంతో పాటు, అక్రమ రవాణాదారులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి" అని ఆయన స్పష్టం చేశారు.

**శాంతిభద్రతలు మరింత మెరుగు : ఎమ్మెల్యే పాయం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతమైన మణుగూరులో అత్యాధునిక సౌకర్యాలతో పోలీస్ స్టేషన్ అందుబాటులోకి రావడం వల్ల శాంతిభద్రతల పరిరక్షణ మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతికతతో నిర్మించిన ఈ భవనం ప్రజలకు మరింత పారదర్శకమైన సేవలు అందించేందుకు దోహదపడుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమం అనంతరం డీజీపీ పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి శాంతి భద్రతలు, నేరాల నియంత్రణపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పోలీసు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంద్ర నగర్ కాలనీలో కుప్పకూలిన భారీ వృక్షం.. పాఠశాల విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం

- ఆటోలు, బైకులు ధ్వంసం
- జీహెచ్ఎంసీ స్పందనపై స్థానికుల ఆగ్రహం....ఎన్‌డీఆర్ఎఫ్‌కు ఫోన్ చేయండి అంటూ సూచన
- కాకతీయ పాఠశాల ఎదురుగా ప్రమాదం.. విద్యార్థుల్లో భయాందోళ
- విద్యుత్ శాఖ స్పందన
- చెట్టు తొలగింపులో జీహెచ్ఎంసీపై విమర్శలు
- నేలకొరిగిన వృక్షాన్ని వెంటనే తొలగించాలి: ఇందిరానగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు నగరపు శ్యామ్ డిమాండ్

**సికింద్రాబాద్, విశాల భారతి:**



నగరంలో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా వీచిన ఈదురుగాలులకు సీతాఫల్‌మండి ఇందిరా నగర్ కాలనీలో కాకతీయ పాఠశాల ఎదురుగా భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఆ సమయంలో పాఠశాల నుంచి చిన్నారులు ఇళ్లకు వెళ్తున్నారు. విద్యార్థులు పాఠశాల ఆవరణలోనే ఉండటంతో భయాందోళనకు గురయ్యారు. భారీ వృక్షం కూలిపోవడంతో సమీపంలో నిలిపి ఉంచిన ఆటోలు, ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నట్లు స్థానికులు తెలిపారు. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారకుండా అప్రమత్తంగా వ్యవహరించిన విద్యుత్ సిబ్బందిని స్థానికులు అభినందించారు. చెట్టు తొలగింపు కోసం జీహెచ్ఎంసీ అత్యవసర విభాగానికి సమాచారం అందించగా, ఎన్‌డీఆర్ఎఫ్‌ను సంప్రదించాలని సూచించారని స్థానికులు ఆరోపించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సేవలు అందించాల్సిన జీహెచ్ఎంసీ ఇలాంటి బాధ్యతారహిత వైఖరి ప్రదర్శించడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు మండిపడ్డారు. ఈ సందర్భంగా ఇందిరానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నగరపు శ్యామ్ మాట్లాడుతూ.... పాఠశాలలు, నివాస ప్రాంతాల వద్ద ప్రమాదకరంగా ఉన్న పాత వృక్షాలను అధికారులు ముందస్తుగా గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కోరారు.



# జెండర్ వివక్షపై కృతి సనన్ సంచలన వ్యాఖ్యలు

సినీ పరిశ్రమ వెలుపల నుంచి చూస్తే గ్లామర్, స్టార్‌డమ్ మాత్రమే కనిపిస్తాయి. కానీ ఆ మెరుపుల వెనుక ఎన్నో అసమానతలు, సవాళ్లు, వివక్ష కూడా ఉంటాయని పలువురు నటీమణులు గతంలో వెల్లడించారు. తాజాగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ కూడా సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొనే జెండర్ వివక్షపై బహిరంగంగా మాట్లాడి చర్చనీయాంశంగా మారారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన కృతి సనన్.. తన కెరీర్ ప్రారంభ దశలో ఎదుర్కొన్న కొన్ని చేదు అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ముఖ్యంగా సినిమా ప్రమోషన్స్ సమయంలో ఓ హీరో తనను కావాలనే పక్కన పెట్టేందుకు ప్రయత్నించాడని, తాను ఏ ప్రమోషనల్ ఈవెంట్‌కు హాజరుకావాలో కూడా ఆయనే నిర్ణయించాలనుకున్నాడని తెలిపారు.Movies అలాంటి పరిస్థితి తనకు తీవ్ర అవమానంగా అనిపించిందని, నా అవసరం లేదనుకుంటే మీరు ఒక్కరే సినిమా ప్రమోట్ చేసుకోండి అని చెప్పి తాను వెనక్కి తగ్గినట్లు వెల్లడించారు. సినిమా సెట్స్‌లో కూడా మహిళా నటీమణులకు, పురుష నటులకు ఇచ్చే ప్రాధాన్యంలో స్పష్టమైన తేడా కనిపించేదని కృతి అన్నారు. హీరోలకు పెద్ద వానిటీ వాన్లు, విశాలమైన గదులు, లగ్జరీ కార్లు ఏర్పాటు చేస్తే.. హీరోయిన్లకు మాత్రం చిన్న గదులు, సాధారణ వాహనాలు కేటాయించేవారని చెప్పారు. తనకు గదుల పరిమాణం లేదా కార్లపై ఆసక్తి లేదని, కానీ అలాంటి తేడాలు మహిళలను తక్కువగా చూసే భావనను కలిగిస్తాయని ఆమె వ్యాఖ్యానించారు. సీనియర్ హీరోల విషయంలో కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు సహజమేనని అంగీకరించిన కృతి.. కొత్తగా వచ్చిన హీరోల విషయంలో కూడా అదే పరిస్థితి కొనసాగుతుందని చెప్పారు. అసిస్టెంట్ డైరెక్టర్లు హీరో సమయాన్ని దృష్టిలో పెట్టుకుని హీరోయిన్లను గంటల ముందే సెట్స్‌కు పిలిచి వేచి ఉండేలా చేసేవారని ఆమె విమర్శించారు. తాను నటనలో ప్రొఫెషనల్ ట్రైనింగ్ తీసుకోకపోవడంతో పాత్ర గురించి దర్శకులను ప్రశ్నిస్తే లేదా ఏదైనా సూచన చేస్తే.. నువ్వు ఎక్కువగా ఆలోచిస్తున్నావ్ అంటూ తన మాటలను పట్టించుకునేవారు కాదని కృతి తెలిపారు. అయితే అదే విషయాన్ని ఓ పురుష నటుడు చెబితే వెంటనే అంగీకరించి, అతని సూచనకు ప్రాధాన్యం ఇచ్చేవారని ఆమె పేర్కొన్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.